RNI TELTEL/2024/89620

నేటి
# శుభోదయం
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

Gk MEDIA

ప్రచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 02, సంచిక 38, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -10, మంగళవారం - 13 - మే - 2025 , వెల రూ.5/-

## పాక్ సైనిక స్థావరాల్లో బీభత్సం సృష్టించిన 'బ్రహ్మోస్'

బ్రహ్మోస్ దాడులతో వణికిన పాక్

పాక్ కీలక స్థావరాలపై క్షణాల్లో దాడులు చేసిన భారత్




బ్రహ్మోస్ క్షిపణిని భారత్, రష్యా కలిసి అభివృద్ధి చేసిన వైనం

ప్రపంచంలోనే శక్తివంతమైన క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్

## పహల్గామ్ దాడి సాకుతోనే భారత్ మాపై దాడికి దిగింది..



పాక్ ప్రధాని సంచలన ఆరోపణ

కాల్పుల విరమణ మా చారిత్రక విజయమన్న షెహబాజ్ షరీఫ్

తమ సైనిక ప్రతిస్పందన వల్లే కాల్పుల విరమణ అన్న పాక్ ప్రధాని

2లో

## ట్రోల్స్ అత్యంత సిగ్గుచేటు.. విక్రమ్ మిస్రీకి అండగా నేతలు, దౌత్యవేత్తలు



కాల్పుల విరమణ ప్రకటన తర్వాత మిస్రీ, ఆయన కుటుంబంపై ఆన్‌లైన్ దాడి

'దేశద్రోహి' అంటూ దూషణలు, కుమార్తెల పౌరసత్వంపై ప్రశ్నలు

కేంద్రం నిర్ణయాలకు అధికారిని నిందించడం సరికాదన్న ఒవైసీ

## కోహ్లీ రిటైర్మెంట్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందన




- టెస్ట్ క్రికెట్‌కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వీడ్కోలు
- కోహ్లీ నాయకత్వం, క్రమశిక్షణ, వారసత్వంపై ప్రశంసలు
- భారత క్రీడా చరిత్రలో కోహ్లీది గొప్ప అధ్యాయమన్న రేవంత్ రెడ్డి

# హైదరాబాద్‌లో సొనాటా సాఫ్ట్‌వేర్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి

- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హబ్‌గా రూపుదిద్దుకుంటోందన్న సీఎం
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటన
- వివిధ ప్రాజెక్టుల కోసం డ్రైపోర్టును ఏర్పాటు
- హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణాన్ని చేపట్టాం
- ఇందులో ప్రత్యేకంగా 'ఏఐ సిటీ' కూడా ఏర్పాటు చేస్తున్నాం
- దాదాపు 1 లక్షకు పైగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించాం
- "హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల హబ్ గా మారింది




హైదరాబాద్ : ఆర్థిక వృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతో పాటే సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని సమతుల్యం చేసుకుంటూ సమగ్రమైన సమ్మిళితమైన అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు చెప్పారు. "తెలంగాణ రైజింగ్" అనే ఆలోచనలో ఈ దార్శనికత ఇమిడి ఉందని అన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సాధించిందేమిటి?




### పహల్గామ్ ఘటనకు ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'

### పాక్, పీవోకేలోని 9 ఉగ్రశిబిరాలు ధ్వంసం

### 100 మందికి పైగా ఉగ్రవాదుల హతం

న్యూఢిల్లీ :పహల్గామ్‌లో ఏప్రిల్ 22న భారత పౌరులను అత్యంత క్రూరంగా హతమార్చిన ఘటనకు ప్రతిస్పందనగా భారతదేశం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలపై భారీ సైనిక చర్య చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్ అనేక వ్యూహాత్మక, సైనిక లక్ష్యాలను ఛేదించి, ఉగ్రవాదంపై తన కఠిన వైఖరిని ప్రపంచానికి స్పష్టం చేసింది. ఈ చర్యతో ప్రాంతీయ భద్రతా సమీకరణాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

ఉగ్ర స్థావరాలు ధ్వంసం.. కీలక ఉగ్రవాదులు హతం

1999 నాటి ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం హైజాక్ సూత్రధారులు, 2019 పుల్వామా దాడిలో ప్రమేయమున్న వారితో సహా వందకు పైగా ఉగ్రవాదులు




## ఆర్టీఐ కమిషనర్లను నియమించిన తెలంగాణ ప్రభుత్వం

నలుగురు ఆర్టీఐ కమిషనర్ల నియామకం

పీవీ శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డికి బాధ్యతలు

ఈ మేరకు ఉత్తర్వులు జారీ

## వచ్చే నెల నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్: పొంగులేటి

హైదరాబాద్ : వచ్చే నెల నుంచి తెలంగాణ వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తాం..అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలన్న లక్ష్యంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మరింత చేరువ




## రామప్ప దగ్గర ఓపెన్ కాస్ట్ గనులను ఒప్పుకోం.. తేల్చిచెప్పిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : ప్రపంచ చారిత్రక వారసత్వ సంపద అయిన రామప్ప దేవాలయం సమీపంలో ఓపెన్ కాస్ట్ గనులను ఏర్పాటు చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. సోమవారం రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2012లోనే రామప్ప ఆలయానికి 5 కి.మీ.ల దూరంలో ఓపెన్ కాస్ట్ మైన్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే అప్పుడు ఉద్యమ నాయకుడుగా కేసీఆర్ ఆ ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఆ ప్రయత్నాలను ముందుకు సాగనివ్వలేదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ ఓపెన్ కాస్ట్ మైన్ పేరుతో బొగ్గు తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఆలయానికి 5 కి.మీ.ల దూరంలో బ్లాస్టింగులు జరిపితే ఆలయం దెబ్బతింటుందని




# మా పోరాటం ఉగ్రవాదులపైనే..

పాక్ నష్టానికి బాధ్యత వారిదే: రక్షణశాఖ

- పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం
- పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం: ఏకే భారతి
- పటిష్ఠ నిఘాతో దాడులను తిప్పికొట్టాం.. వైస్ అడ్మిరల్ ప్రమోద్




ఇంటర్నెట్ డెస్క్: 'ఆపరేషన్ సిందూర్ 'లో భాగంగా మే 7న జరిపిన దాడుల్లో ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు రక్షణశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులపైనే తమ పోరు అని 'ఆపరేషన్ సిందూర్'పై

## తారక రామారావుకు ఆల్ ది బెస్ట్: సీఎం చంద్రబాబు




జానకీరామ్ కుమారుడు తారక రామారావు, వైవీఎస్ చౌదరి కాంబోలో సినిమా

పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన మూవీ

ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఎన్టీఆర్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

# నర్సుల సేవలు అనన్య సామాన్యం

## అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

- పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో పవన్ భేటీ
- విశిష్ట సేవలు అందించిన 8 మంది నర్సులకు సత్కారం
- వైద్యరంగంలో నర్సుల సేవలు వెలకట్టలేనివన్న డిప్యూటీ సీఎం
- నర్సులు తమ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు




అమరావతి : అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విశిష్ట సేవలు అందించిన 8 మంది నర్సులను ఉపముఖ్యమంత్రి సత్కరించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ... వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని కొనియాడారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివని అన్నారు. విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరిచిపోరని తెలిపారు. మహమ్మారి కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నర్సులు చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇక, ఇటీవల సింగపూర్‌లో తన కుమారుడు మార్క్ శంకర్ పాఠశాలలో సంభవించిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డ తర్వాత ఆసుపత్రిలో చేరాడని, అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరోసారి వారి కష్టం గుర్తుకొచ్చిందని చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా వారిని కలవడం ఎంతో ఆనందాన్ని

# జాతికి ప్రధాని నరేంద్ర మోదీ సందేశం!

- పాక్‌తో ఒప్పందం అనంతరం.. జాతిని ఉద్దేశించి మోదీ కీలక ప్రసంగం
- 'ఆపరేషన్ సిందూర్' తర్వాత తొలిసారి ప్రధాని ప్రసంగం
- పహల్గామ్ దాడికి ప్రతిగా మే 7న భారత బలగాల 'ఆపరేషన్ సిందూర్'
- రెండు రోజుల క్రితం భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం




న్యూఢిల్లీ :భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాత్రి 8 గంటలకు జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. ఇటీవల భారత సాయుధ దళాలు'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతంగా పూర్తి చేయడం, ఆ తర్వాత పాకిస్థాన్‌తో కీలక కాల్పుల విరమణ

## పాక్ సైనిక స్థావరాల్లో బీభత్సం సృష్టించిన 'బ్రహ్మోస్'

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్‌తో భారత్ పాకిస్థాన్‌ను చావుదెబ్బ తీసిన విషయం తెలిసిందే. శనివారం జరిగిన దాడిలో పాకిస్థాన్ భారీ నష్టాన్ని చవిచూసింది. పాకిస్థాన్‌కు చెందిన దాదాపు పది వైమానిక స్థావరాలపై భారత్ విరుచుకుపడింది. ఈ దాడిలో భారత్ హ్యామర్ గైడెడ్ బాంబులు, స్కాల్ప్ క్షిపణులతో పాటు బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిని కూడా ఉపయోగించినట్లు సమాచారం. భారత్ ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ, బ్రహ్మోస్ క్షిపణి వల్లనే పాక్ వైమానిక స్థావరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయని భావిస్తున్నారు. జాతీయ మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. యుద్ధరంగంలో బ్రహ్మోస్ క్షిపణిని భారత్ ఉపయోగించడం ఇదే మొదటిసారి కావచ్చని అభిప్రాయపడుతున్నారు. పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై భారత్ దాడికి ముందు, పాకిస్థాన్ ఒక బాలిస్టిక్ క్షిపణిని హర్యానాలోని సిర్సాపైకి ప్రయోగించింది. దీంతో ఆగ్రహించిన భారత్ అత్యాధునిక ఆయుధాలతో పాక్ వైమానిక స్థావరాలపై విరుచుకుపడినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు అణు యుద్ధానికి దారితీస్తాయన్న ఆందోళనతో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రుబియో రంగంలోకి దిగి కాల్పుల విరమణ కోసం పాక్‌తో అత్యవసరంగా చర్చలు జరిపినట్లు సమాచారం. పాకిస్థాన్ అధికారిక రాజధాని ఇస్లామాబాద్ అయినప్పటికీ, పాలన మొత్తం రావల్పిండి నుంచే జరుగుతుంది. రావల్పిండిలోని చక్లాలా ఆర్మీ చీఫ్ కార్యాలయం నుంచే ఆదేశాలు వెళుతుంటాయి. శనివారం తెల్లవారుజామున పాకిస్థాన్‌లోని ఈ కీలక ప్రాంతాన్ని భారత్ లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. చక్లాలాలో పాక్ వాయుసేనకు చెందిన మొబిలిటీ కమాండ్ ఉంది. దీనితో పాటు గగనతల రిఫ్యూయలింగ్ ట్యాంకర్ ఫైటర్లు, హెవీ లిఫ్టర్లు అక్కడ ఉన్నాయి. భారత్ దాడిలో వాటికి తీవ్ర నష్టం వాటిల్లింది. నూకాన్, సర్గోదా, రఫీ వంటి స్థావరాలపై భారత యుద్ధ విమానాలు దాడులు చేశాయి. ఈ దాడుల్లో వైమానిక స్థావరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లు, రాడార్ సైట్లు, ఆయుధ నిల్వ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. భారత్ నిమిషాల వ్యవధిలో పాక్‌కు చెందిన కీలక వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడంతో ఆ దేశం తీవ్ర ఆందోళనకు గురైంది. దీంతో అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణకు పాక్ అంగీకరించినట్లు తెలుస్తోంది. పాక్‌ను తీవ్రంగా దెబ్బతీసిన బ్రహ్మోస్ క్షిపణిని భారత్, రష్యా కలిసి అభివృద్ధి చేశాయి. ఇది ప్రపంచంలోనే శక్తివంతమైన క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందింది.

## పహల్గామ్ దాడి సాకుతోనే భారత్ మాపై దాడికి దిగింది..

### పాక్ ప్రధాని సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ : ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడిని ఒక సాకుగా చూపి భారత్ తమ దేశంపై దాడికి పాల్పడిందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్ర ఆరోపణలు చేశారు. జాతినుద్దేశించి ప్రసంగించిన ఆయన ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని తమ దేశ 'చారిత్రక విజయం'గా అభివర్ణించారు. భారత దురాక్రమణకు తమ సైన్యం సమర్థవంతంగా బదులిచ్చిందని ప్రశంసించారు. కొన్ని రోజుల పాటు కొనసాగిన తీవ్ర సరిహద్దు ఉద్రిక్తతల అనంతరం భూమి, గాలి, సముద్ర మార్గాల ద్వారా అన్ని రకాల సైనిక చర్యలను నిలిపివేయడానికి భారత్, పాకిస్థాన్ అంగీకరించిన కొన్ని గంటలకే షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తన ప్రసంగంలో జాతీయవాద అంశాలను ప్రముఖంగా ప్రస్తావించిన ఆయన "మా చర్య విద్వేషం, దురాక్రమణ, మత మూర?త్వంపై జరిగింది. ఇది మా సూత్రాలకు, గౌరవానికి దక్కిన విజయం. ఒక గౌరవప్రదమైన దేశానికి తగిన శత్రువుతో మేం దీన్ని చేశాం. ఇది కేవలం సాయుధ బలగాల విజయం మాత్రమే కాదు, మొత్తం జాతి విజయం" అని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇస్లామాబాద్ చొరవతో జరిగిన దౌత్యపరమైన అవగాహన కాదని, పాకిస్థాన్ సైనిక పరాక్రమం వల్లే సాధ్యమైందని షరీఫ్ తన టెలివిజన్ ప్రసంగంలో చిత్రీకరించే ప్రయత్నం చేశారు. "శత్రువుకు బాగా అర్థమయ్యే భాషలోనే సమాధానం చెప్పాలని మేం నిర్ణయించుకున్నాం" అని ఆయన ప్రకటించారు. పాకిస్థాన్ "ఆత్మగౌరవం, నిజాయితీ కలిగిన దేశం" అనడానికి ఈ ఒప్పందమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తమ సాయుధ బలగాలు భారత్ వైమానిక స్థావరాలు, ఆయుధాగారాలను ధ్వంసం చేశాయని షరీఫ్ ఘనంగా ప్రకటించారు. అయితే, ఈ ఆరోపణలను భారత అధికారులు కల్పితాలుగా కొట్టిపారేశారు. దాదాపు 20 నిమిషాల తన ప్రసంగంలో షరీఫ్ మొత్తం విషయాన్ని మార్చివేసేందుకు ప్రయత్నించినట్లు కనిపించింది. పహల్గామ్ ఘటనను సాకుగా చూపి భారత్ తమపై 'అన్యాయమైన యుద్ధం' ప్రకటించిందని, పాకిస్థాన్‌ను బాధితురాలిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. భారత బలగాలు పౌరులు, మసీదులు, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలను భారత్ తప్పుడు ప్రచారంగా ఖండించింది. వాస్తవానికి, క్షేత్రస్థాయి దృశ్యాలు భారత వైమానిక స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని, మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని చూపించాయి. ఇది షరీఫ్ వాదనలకు విరుద్ధంగా ఉంది. అంతేకాకుండా కాల్పుల్లో పాకిస్థాన్ పౌరులకు ఎలాంటి హాని కలగకుండా ఉండేలా ప్రతీకార చర్యలు పద్ధతి ప్రకారం చేపట్టామని భారత ప్రభుత్వం తెలిపింది.

## ట్రోల్స్ అత్యంత సిగ్గుచేటు..

## విక్రమ్ మిస్రీకి అండగా నేతలు, దౌత్యవేత్తలు

న్యూఢిల్లీ : భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించిన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో తీవ్ర దూషణలకు పాల్పడటం కలకలం రేపింది. ఈ ఘటనపై పలువురు రాజకీయ నాయకులు, మాజీ దౌత్యవేత్తలు తీవ్రంగా స్పందిస్తూ ఆయనకు అండగా నిలిచారు. ప్రభుత్వ నిర్ణయాలను వెల్లడించినందుకు ఒక అధికారిని, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అవగాహన కుదిరిందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. తక్షణమే భూమి, గగనతలం, సముద్ర మార్గాల్లో అన్ని రకాల సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలని ఇరు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) ఒక అవగాహనకు వచ్చినట్టు మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే మిస్రీని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోలింగ్ మొదలైంది. 'ద్రోహి', 'గద్దర్', 'దేశద్రోహి' వంటి పదజాలంతో ఆయనపై దూషణలకు దిగారు. మరికొందరు ఆయన కుమార్తెల పౌరసత్వాన్ని కూడా ప్రశ్నిస్తూ పోస్టులు పెట్టారు. ఈ ఆన్‌లైన్ దాడిని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. మిస్రీ వంటి 'నిజాయితీపరుడు, కష్టపడి పనిచేసే' అధికారిని కేవలం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేసినందుకు దాడి చేయడం సరికాదని అన్నారు. 'విక్రమ్ మిస్రీ మన దేశం కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్న నిజాయతీపరుడైన, కష్టపడి పనిచేసే దౌత్యవేత్త. మన ప్రభుత్వోద్యోగులు కార్యనిర్వాహక వర్గం కింద పనిచేస్తారనేది గుర్తుంచుకోవాలి. కార్యనిర్వాహక వర్గం లేదా దేశాన్ని నడుపుతున్న ఏ రాజకీయ నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు వారిని నిందించకూడదు' అని ఒవైసీ ఎక్స్‌లో పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా మిస్రీ గౌరవాన్ని కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆయన కేవలం సమాచారాన్ని అందించే వ్యక్తి మాత్రమేనని, నిర్ణయాలు తీసుకోవాల్సింది ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. 'కొంతమంది సంఘ విద్రోహులు ఆ అధికారి, ఆయన కుటుంబంపై దూషణల విషయంలో అన్ని హద్దులు దాటుతున్నా బీజేపీ ప్రభుత్వం గానీ, మంత్రులు గానీ ఆయన గౌరవాన్ని కాపాడటానికి ముందుకు రావడం లేదు. అవాంఛనీయ పోస్టులు చేసే వారిపై చర్యల గురించి చర్చించడం లేదు' అని అఖిలేష్ యాదవ్ ఎక్స్‌లో రాశారు. మాజీ విదేశాంగ కార్యదర్శి నిరుపమా మీనన్ రావు ఈ ఆన్‌లైన్ దుష్ప్రచారాన్ని 'అత్యంత సిగ్గుచేటు' అని అభివర్ణించారు. ఇది 'సభ్యతకు సంబంధించిన అన్ని హద్దులను దాటింది' అని ఆమె అన్నారు. "భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణ ప్రకటనపై విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఆయన కుటుంబాన్ని ట్రోల్ చేయడం చాలా దారుణం. అంకితభావంతో పనిచేసే దౌత్యవేత్తగా, మిస్రీ వృత్తి నైపుణ్యంతో, దృఢ సంకల్పంతో భారతదేశానికి సేవ చేశారు. ఆయనను కించపరచడానికి ఎలాంటి ఆస్కారం లేదు. ఆయన కుమార్తె వివరాలు బహిర్గతం చేయడం, ఆయన ఆప్తులను దూషించడం సభ్యతకు సంబంధించిన అన్ని హద్దులను దాటింది. ఈ విషపూరిత ద్వేషం ఆగాలి. మన దౌత్యవేత్తల వెనుక ఐక్యంగా నిలబడాలి, వారిని కించపరచకూడదు" అని ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## కోహ్లీ రిటైర్మెంట్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందన

హైదరాబాద్ : టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలకడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. భారత క్రికెట్ చరిత్ర పుటల్లో విరాట్ కోహ్లీ పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని అన్నారు. అద్భుతమైన క్రీడా వారసత్వాన్ని కోహ్లీ విజయవంతంగా కొనసాగించాడని ప్రశంసించారు. ఆట పట్ల అంకితభావం, అత్యున్నత క్రమశిక్షణతో ఎన్నో రికార్డులు నెలకొల్పి, ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. టెస్టు క్రికెట్ నుంచి వైదొలగినప్పటికీ, మిగిలిన ఫార్మాట్లలో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఈ నేపథ్యంలో పలువురు ప్రముఖులు, అభిమానులు కోహ్లీ క్రీడా జీవితాన్ని, నాయకత్వ పటిమను కొనియాడుతూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

## నర్సుల సేవలు అనన్య సామాన్యం

మొదటి పేజి తరువాయి

ఇచ్చిందని జనసేనాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నర్సులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## తారక రామారావుకు ఆల్ ది బెస్ట్: సీఎం చంద్రబాబు

అమరావతి : నందమూరి హరికృష్ణ మనవడు, జానకీరామ్ కుమారుడు నందమూరి తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ ఈరోజు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తారక రామారావుకు ఆల్ ది బెస్ట్ చెబుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఎన్‌టీఆర్ గొప్ప విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. "తారక రామారావు ఇండస్ట్రీలో అడుగుపెడుతోన్న సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎన్‌టీఆర్ గొప్ప విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాను" అని సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. హీరో తారక రామారావు మాట్లాడుతూ... "మా ముత్తాత ఎన్‌టీఆర్, మా తాత హరికృష్ణ, మా నాన్న జానకీరామ్ ఆశీస్సులు ఎప్పుడూ నాతోనే ఉంటాయని నమ్ముతున్నాను. ఈ రోజు నా కుటుంబసభ్యులందరూ నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడి రావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నన్ను ముందుకు నడిపిస్తాయని నమ్ముతున్నాను. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటినుంచి మీడియా ఎంతో సహకరించింది. వారందరికీ కృతజ్ఞతలు" అని అన్నారు. కాగా, మూవీ ప్రారంభత్సవ కార్యక్రమానికి నారా భువనేశ్వరి, దుగ్గబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి హాజరయ్యారు. నారా భువనేశ్వరి హీరోహీరోయిన్లపై క్లాప్ కొట్టి అభినందించారు. తన తండ్రి సీనియర్ ఎన్‌టీఆర్ నటనలో ఎంత కీర్తి తెచ్చుకున్నారో తారక రామారావు కూడా అలానే ఎదగాలని ఆకాంక్షించారు.

## హైదరాబాద్‌లో సొనాటా సాఫ్ట్‌వేర్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ఫెసిలిటీ సెంటర్‌ను ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, హైదరాబాద్‌ను ప్రపంచంలోని అద్భుత నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రణాళికలను ఈ వేదికగా వివరించారు. అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడంలో, తెలంగాణ అభివృద్ధిని ప్రపంచం ముందు చాటడానికి ప్రతి ఒక్కరి సహకారం కావాలని, హైదరాబాద్ బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని కోరారు. "హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల హబ్ గా మారింది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, ఏఐ -రెడీ డేటా సెంటర్లలో ప్రముఖంగా నిలుస్తోంది. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి గ్లోబల్ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించాయి. హైదరాబాద్ అంతర్జాతీయ ప్రాముఖ్యత పెరిగింది. ప్రస్తుతం మిస్ వరల్డ్ పోటీలకు ఈ నగరం ఆతిథ్యమిస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ ఈవెంట్లు హైదరాబాద్‌లో నిర్వహిస్తాం. తెలంగాణ అనేక కీలక రంగాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం పోలీసింగ్ లో గానీ, చట్టాలను సరిగా అమలు చేయడంలోగానీ, ద్రవ్యోల్బణ నియంత్రణ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ కల్పన, పన్నుల వసూళ్లలో తెలంగాణ అగ్రగామిగా ఉంది.



స్వయం సహాయ సంఘాల ద్వారా 66 లక్షల మందికి పైగా మహిళలకు సాధికారత కల్పిస్తూ, దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఫండింగ్ మరియు మెంటరింగ్ కార్యక్రమాన్ని తెలంగాణ అమలు చేస్తోంది. రాజీవ్ యువ వికాసం కార్యక్రమం ద్వారా వేలాది యువతకు వ్యాపార, స్వయం ఉపాధి రంగాల్లో మద్దతు అందిస్తున్నాం. అలాగే, సమానత్వం దిశగా కీలక అడుగు వేసిన తెలంగాణ, ట్రాన్స్‌జెండర్ వాలంటీర్లను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ బృందంలో చేర్చిన మొదటి రాష్ట్రంగా నిలిచింది. తెలంగాణలో మౌలిక సదుపాయాలు, వివిధ ప్రాజెక్టుల కోసం డ్రైపోర్టును ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని సముద్రతీర పోర్టుకు అనుసంధానం చేయనున్నాం. భారతదేశంలోనే అత్యంత శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణాన్ని చేపట్టాం. ఇందులో ప్రత్యేకంగా 'ఏఐ సిటీ' కూడా ఏర్పాటు చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడం వంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నాం. 2023 డిసెంబర్ నుండి ఇప్పటివరకు తెలంగాణ 3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, దాదాపు 1 లక్షకు పైగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించాం. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశం, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశాల ద్వారా పెట్టుబడుల ఆకర్షణలో భారతదేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ నిలిచింది. దావోస్ సమావేశంలోనే 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు లభించాయి." అని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఐటీ మరియు పరిశ్రమల మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, సొనాటా సాఫ్ట్‌వేర్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శ్రీ సమీర్ ధీర్ గారితో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సాధించిందేమిటి?

న్యూఢిల్లీ :పహల్గామ్‌లో ఏప్రిల్ 22న భారత పౌరులను అత్యంత క్రూరంగా హతమార్చిన ఘటనకు ప్రతిస్పందనగా భారతదేశం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలపై భారీ సైనిక చర్య చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్ అనేక వ్యూహాత్మక, సైనిక లక్ష్యాలను ఛేదించి, ఉగ్రవాదంపై తన కఠిన వైఖరిని ప్రపంచానికి స్పష్టం చేసింది. ఈ చర్యతో ప్రాంతీయ భద్రతా సమీకరణాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

ఉగ్ర స్థావరాలు ధ్వంసం.. కీలక ఉగ్రవాదులు హతం

1999 నాటి ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం హైజాక్ సూత్రధారులు, 2019 పుల్వామా దాడిలో ప్రమేయమున్న వారితో సహా వందకు పైగా ఉగ్రవాదులు ఈ దాడుల్లో మరణించారు. పాకిస్థాన్, పీవోకే వ్యాప్తంగా తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను భారత దళాలు అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేశాయి. ఈ శిబిరాలను లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలు నిర్వహిస్తున్నాయని, ఇవి భారత్‌పై దాడులకు శిక్షణ, ప్రణాళికా కేంద్రాలుగా ఉన్నాయని నిఘా వర్గాలు గుర్తించాయి.

పాక్ డ్రోన్ దాడులు

పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో పాకిస్థాన్ కూడా జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లోని భారత సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగింది. దీనికి భారత్ కూడా తీవ్రంగా ప్రతిస్పందించింది. మే 7 నుంచి మే 10 వరకు నాలుగు రోజుల పాటు ఇరు దేశాల మధ్య డ్రోన్ దాడులు, క్షిపణి ప్రయోగాలు, నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు కొనసాగాయి. ఇరు దేశాలు యుద్ధం అంచు వరకు వెళ్లాయి. అనంతరం మే 10న తక్షణమే భూమి, గాలి, సముద్ర మార్గాల్లో అన్ని రకాల కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయడానికి ఇరుపక్షాలు ఒక అంగీకారానికి వచ్చాయి. ఉగ్రవాదానికి భారత్ ఎలా సమాధానమిస్తుందో ఈ నాలుగు రోజులు ప్రపంచానికి స్పష్టంగా చాటి చెప్పింది.

పాకిస్థాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి దాడులు

పీవోకేకే పరిమితం కాకుండా పాకిస్థాన్ ప్రధాన భూభాగంలో వందల కిలోమీటర్ల లోపలికి వెళ్లి భారత దళాలు దాడులు నిర్వహించాయి. అమెరికా డ్రోన్లు కూడా లక్ష్యంగా చేసుకోవడానికి వెనుకాడిన బహవల్పూర్ వంటి సున్నితమైన ప్రాంతాలతో సహా, పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను భారత యుద్ధ విమానాలు తొలిసారిగా లక్ష్యంగా చేసుకున్నాయి. పాకిస్థాన్ గడ్డపై నుంచి ఉగ్రవాదం పుడితే, ఆ దేశంలోని ఏ ప్రాంతమైనా తమకు అందుబాటులోనే ఉంటుందని భారత్ నిస్సందేహంగా నిరూపించింది.

భారత్ వైఖరిలో మార్పు

ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తన విధానంలో ఒక కీలక మార్పును ప్రకటించింది. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా కలిగిన దేశాలకు తక్షణ, ప్రత్యక్ష పరిణామాలుంటాయని స్పష్టం చేస్తూ ఒక కొత్త హద్దును నిర్దేశించింది. ఉగ్రవాదులు, వారి ప్రోత్సాహకుల మధ్య ఉన్న పాత విభజనను ఈ ఆపరేషన్ తిరస్కరించింది, పాకిస్థాన్ ప్రభుత్వాన్నే నేరుగా బాధ్యుల్ని చేసింది. "పాకిస్థాన్ ప్రేరేపిత సరిహద్దు ఉగ్రవాదానికి ప్రతిస్పందనగా భారత్ ఒక 'కొత్త సాధారణ పరిస్థితి'ని నెలకొల్పింది. పాకిస్థాన్ సైన్యం ఎలాంటి చర్యకు పాల్పడినా దానికి భారత ప్రతిస్పందన మరింత పెద్దదిగా, బలంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాయుధ దళాలను ఆదేశించారు" అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

బట్టబయలైన పాక్ వాయు రక్షణ, భారత్ సామర్థ్యం

భారత దళాలు చైనా తయారీ వాయు రక్షణ వ్యవస్థలను ఛేదించి, నిర్వీర్యం చేశాయి. కేవలం 23 నిమిషాల వ్యవధిలో, భారత రఫేల్ యుద్ధ విమానాలు స్కాల్ప్ క్షిపణులు, హ్యామర్ బాంబులతో పౌరులకు ఎలాంటి నష్టం లేకుండా తమ లక్ష్యాలను పూర్తి చేశాయి. ఈ ఆపరేషన్ పాకిస్థాన్ వాయు రక్షణ సన్నద్ధతలోని కీలక లోపాలను బహిర్గతం చేసింది. అదే సమయంలో భారత్ తన ఆధునిక, బహుళస్థాయి వాయు రక్షణ సామర్థ్యాలను కూడా ప్రదర్శించింది. ఆకాశ్‌తీర్ వాయు రక్షణ వ్యవస్థ వందలాది పాకిస్థానీ డ్రోన్లు, క్షిపణులను విజయవంతంగా నిర్వీర్యం చేసింది. దీని సమర్థత భారత గగనతలాన్ని సురక్షితం చేయడమే కాకుండా, ప్రపంచ ఎగుమతి మార్కెట్‌లో ఒక విశ్వసనీయ వ్యవస్థగా నిలిపింది. ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానానికి అనుగుణంగా, భారత్ కేవలం ఉగ్రవాద మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుంది. పౌర, సైనిక నష్టం జరగకుండా జాగ్రత్తపడింది.

### పాక్ సైనిక మౌలిక వసతులకు నష్టం

మే 9, 10 తేదీల రాత్రులలో మూడు గంటల పాటు సాగిన దాడుల్లో భారత్ 11 పాకిస్థాన్ వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో పాకిస్థాన్ వైమానిక దళ మౌలిక సదుపాయాలలో 20 శాతం దెబ్బతిన్నాయి. నూర్‌ఖాన్, రఫీకి, మురిద్, సుక్కూర్, జాకోబాబాద్ వంటి కీలక స్థావరాలు దెబ్బతిన్నాయి. భోలారి వైమానిక స్థావరంలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసుఫ్, నలుగురు వైమానిక సిబ్బందితో సహా 50 మందికి పైగా మరణించగా, యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించడంలో భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం అద్భుతమైన సమన్వయాన్ని ప్రదర్శించాయి. ఇది సంయుక్త యుద్ధ తంత్రంలో భారత్‌కు పెరుగుతున్న సామర్థ్యాన్ని ప్రతిబింబించింది.

### ప్రపంచానికి బలమైన సందేశం

తన ప్రజలను రక్షించుకోవడానికి ఎవరి అనుమతి కోసం ఎదురుచూడబోమని భారత్ ప్రపంచానికి స్పష్టం చేసింది. ఉగ్రవాదాన్ని సహించమని, దాని వెనుక ఉన్నవారు ఎక్కడా దాక్కోలేరని ఆపరేషన్ సిందూర్ గట్టి హెచ్చరిక పంపింది. రెచ్చగొడితే, భారత్ ప్రతిస్పందించడమే కాకుండా పూర్తి శక్తితో ప్రతీకారం తీర్చుకుంటుందని నిరూపించింది. గత ఘర్షణల సమయంలో భారత్ సంయమనం పాటించాలని ప్రపంచ దేశాలు పిలుపునిచ్చిన దానికి భిన్నంగా, ఆపరేషన్ సిందూర్‌కు ప్రపంచ నాయకులు మద్దతు తెలిపారు. దౌత్యపరంగా కూడా భారత్‌కు అనుకూలంగా పరిస్థితులు మారాయి. తొలిసారిగా, భారత్-పాకిస్థాన్ సంబంధాలపై ప్రపంచ దృక్పథం కశ్మీర్ కోణం నుంచి పూర్తిగా ఉగ్రవాదం వైపు మళ్లింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారత్ చేసిన లక్షిత దాడులను ప్రపంచం ఒక చట్టబద్ధమైన, నియంత్రిత రక్షణ చర్యగా గుర్తించింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తన పౌరులకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవడమే కాకుండా, ఈ ప్రాంతంలో భవిష్యత్ ముప్పులను ఎలా ఎదుర్కోవాలో స్పష్టం చేస్తూ, సరికొత్త నిబంధనలను నిర్దేశించింది.

## మా పోరాటం ఉగ్రవాదులపైనే..

నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను అధికారులు ప్రదర్శించారు. పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. పాకిస్థాన్ దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయని, దాయాది ఆటలు సాగనివ్వలేదన్నారు. అనంతరం పాక్‌లోని నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు.

పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం: ఏకే భారతి

"పాకిస్థాన్, పీవోకేలో ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశాం. పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఉగ్రవాదుల శిబిరాలే లక్ష్యంగా మనం యుద్ధం చేశాం. అత్యాధునిక క్షిపణి రక్షక వ్యవస్థలతో పాక్ క్షిపణులు, డ్రోన్‌లను తిప్పికొట్టాం. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశాం. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆకాశ్‌ను ఈ ఆపరేషన్‌లో సమర్థంగా వినియోగించాం. పాకిస్థాన్‌కు చెందిన సామాన్య పౌరులకూ ఎలాంటి నష్టం చేయలేదు. అదే సమయంలో పాకిస్థాన్ వైపు నుంచి దాడులను సమర్థంగా తిప్పికొట్టాం. చైనా తయారు చేసిన పీఎల్-15 క్షిపణిని నేలకూల్చాం. పాకిస్థాన్‌కు చెందిన అనేక డ్రోన్లు, మిస్సైళ్లను కూల్చివేశాం. ఉగ్రవాదంపై పోరాటంలో పాక్ సైన్యం జోక్యం చేసుకుంటే తిప్పికొట్టాం. కరాచీ సమీపంలోని లక్ష్యాలపైనా దాడులు చేశాం" అని ఎయిర్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు.

పటిష్ఠ నిఘాతో దాడులను తిప్పికొట్టాం.. వైస్ అడ్మిరల్ ప్రమోద్

భారత్ వైపు గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామన్నారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని చెప్పారు. డ్రోన్లు, హైస్పీడ్ మిసైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు పేర్కొన్నారు. "వందల కి.మీ దూరంలో ఉన్న శత్రుసేనల విమానాలను దగ్గరకు రాకుండా అడ్డుకున్నాం. త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. మన స్వదేశీ ప్రతిస్పందన దాడి వ్యవస్థ చాలా బలమైంది. సైన్యానికి అండగా నిలిచిన 140 కోట్ల మంది ప్రజలకు ధన్యవాదాలు. ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉంది" అని వైస్ అడ్మిరల్ ప్రమోద్ స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా ఉగ్రవాదం తీరులో మార్పు వచ్చిందని.. ఉగ్రవాదులు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆర్మీ డీజీఎంవో రాజీవ్ ఘాయ్ అన్నారు.

## వచ్చే నెల నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్:



హైదరాబాద్ : వచ్చే నెల నుంచి తెలంగాణ వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తాం..అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలన్న లక్ష్యంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మరింత చేరువ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని మంత్రి పొంగులేటి కోరారు. రెండో దశలో భాగంగా రాష్ట్రంలో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభమైంది మొదటి దశలోని 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో, రెండో దశలో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 47 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమలులోకి వచ్చింది. వచ్చేనెలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేసాం. రిజిస్ట్రేషన్‌కు వచ్చి గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించి క్యూ లైన్లలో నిల్చోనే పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు, సమయాన్ని ఆదా చేసేందుకు, పారదర్శకతను తీసుకురావడానికి ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురావడం జరిగింది. త్వరలో క్యూలైన్లకు గుడ్‌బై చెప్పే రోజులు వస్తాయని దళారులు ప్రమేయం కూడా ఉండబోదు. ఈ స్లాట్ బుకింగ్ ద్వారా కేవలం 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుండడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్ సైట్ %తీవస్త్రఖర్‌తీఫ్ఙఅశీళ్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీఙ.ఱఅ% స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏరోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుకింగ్ ఉపయోగపడుతుందని, అలాగే సేవల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా ప్రజలు మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన చోట రిజిస్ట్రార్ల సంఖ్యకూడా పెంచుతున్నామని మంత్రి పొంగులేటి వివరించారు.

## రామప్ప దగ్గర ఓపెన్ కాస్ట్ గనులను ఒప్పుకోం..

## తేల్చిచెప్పిన ఎమ్మెల్సీ కవిత

ఆందోళన వ్యక్తం చేశారు. యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప ఆలయంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో ఈ ఒక్క ప్రయత్నంతో తేలిపోతుందన్నారు. కేసీఆర్ ప్ర ప్రభుత్వంలోనే రామప్ప ఆలయానికి గుర్తింపు తెచ్చుకున్నామని గుర్తు చేశారు. అప్పుడు చిన్నపాటి పనులు పెండింగ్ లో ఉంటే ఏడాదిన్నరగా పట్టించుకోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం, మంత్రి సీతక్క ఇప్పుడు అందాల పోటీల కోసం పై పై మెరుగులు దిద్దుతున్నారని అన్నారు. ములుగు నియోజకవర్గంలో రైతులు, ప్రజలు చనిపోతున్నా మంత్రి సీతక్క పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే సీతక్కకు ప్రజలపై ప్రేమ ఉంటుంది తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత ఉండదా అని ప్రశ్నించారు. అకాల వర్షాలకు పంట దెబ్బతిని ఒక రైతు చనిపోయారని, ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఇదే నియోజకవర్గంలో ప్రజలు చనిపోయారని తెలిపారు. ఇంత జరుగుతున్నా మంత్రి సీతక్క ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తర్వాత సీతక్కకు అంతటి ప్రాధాన్యత ఉంటుందని స్వయంగా సీఎం చెప్పారని గుర్తు చేశారు. అంత ప్రాధాన్యం ఉన్న సీతక్క నియోజకవర్గ ప్రజలకు ఏ ఒక్క కొత్త పథకాన్ని కూడా అందించలేకపోయారని అన్నారు. కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదని, ఉన్న పింఛన్ లు పెంచలేదని, మహాలక్ష్మీ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని అన్నారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి తప్ప ఈ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. దేశ సరిహద్దుల్లో ఒకవైపు యుద్ధం జరుగుతుంటే మన ముఖ్యమంత్రి అందాల పోటీలకు హాజరయ్యారని.. ఈ ముఖ్యమంత్రికి, మంత్రి సీతక్కకు అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజలపై లేదన్నారు.

నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజపురంలో ఎరుకల నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. రామానుజపురంలో నాంచారమ్మ జాతరకు హాజరై నాంచారమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం ఎరుకల కులస్తులతో కలిసి కవిత సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, 800 ఏళ్ల క్రితమే ఇక్కడ నాంచారమ్మ ఆలయం ఉన్నట్టుగా గురుతులు ఉన్నాయని తెలిపారు. ఈ జాతరలో పాల్గొనడానికి హైదరాబాద్ నుంచి 6 గంటల పాటు ప్రయాణించి వచ్చానని అన్నారు. నాంచారమ్మ ఆలయ నిర్మాణంతో పాటు జాతరకు ప్రభుత్వం చేయూతనివ్వాలన్నారు. మంత్రి సీతక్క సొంత నియోజకవర్గం కాబట్టి ఆమె చొరవ చూపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎరుకల నాంచారమ్మ జాతర అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అత్యంత వెనుకబడిన ఎరుకల కులం వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ ఎరుకల ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ పథకాన్ని తీసుకువచ్చారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు, నాయకులు కేతిని రాజశేఖర్, లోకిని సమ్మయ్య, మానపాటి రమేష్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ కమిషనర్లను నియమించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నియామకాలు చేపట్టింది. రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కమిషనర్లుగా నలుగురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత కొంతకాలంగా ఈ పదవులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నూతనంగా నియమితులైన వారిలో పీవీ శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి ఉన్నారు. పౌరులకు సమాచారం అందించడంలో ఆర్టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తున్న విషయం విదితమే. ఈ నలుగురు కమిషనర్ల నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది. వీరు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంలో సమాచార కమిషన్ పాత్ర అత్యంత ముఖ్యమైనది.

## జాతికి ప్రధాని నరేంద్ర మోదీ సందేశం!

ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ ప్రసంగం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆపరేషన్ అనంతరం ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి మాట్లాడటం ఇదే తొలిసారి. గత నెలలో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి బదులుగా భారత సాయుధ బలగాలు 'ఆపరేషన్ సిందూర్' పేరిట ఈ నెల 7వ తేదీన ప్రతిచర్యకు దిగాయి. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ భూభాగం, పీఓకేలలో ఉన్న తొమ్మిది ఉగ్రవాద శిక్షణా శిబిరాలను విజయవంతంగా ధ్వంసం చేశాయి. ఈ సైనిక చర్యలో కనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. ఈ 'ఆపరేషన్ సిందూర్' ముగిసిన అనంతరం, రెండు రోజుల క్రితం, భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. భూమి, ఆకాశం, సముద్ర మార్గాల ద్వారా ఎలాంటి సైనిక దాడులకు పాల్పడరాదని, కాల్పుల విరమణ పాటించాలని ఇరు దేశాలు పరస్పరం అంగీకారానికి వచ్చాయి. ఈ శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి మాట్లాడనున్నారు.

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తల్లి పార్ధీవదేవాన్ని సందర్శించిన పత్య నాయక్



ఆమనగల్లు(నేటి శుభోదయ): ఆమనగల్లు మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్ మాతృమూర్తి ఆదివారం రోజు మరణించడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆమనగల్లు మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డా.నేనావత్ పత్య నాయక్ వారి స్వగ్రామమైన చింతలపల్లికి వెళ్ళి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం చుక్క నిరంజన్ గౌడ్ మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. మున్సిపాలిటీ అధ్యక్షులు పత్య నాయక్ తో పాటు వారి వెంట సీనియర్ నాయకులు ఎంగలి రఘు,గుత్తి బాలస్వామి,మాజీ ఎంపీటీసీ సరిత పంతునాయక్,మాజీ సర్పంచ్ సోనా శ్రీను నాయక్,ఏఎంసి మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్,సురేష్,తదితరులు ఉన్నారు.

### అమ్మవారి శాలలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించిన ఆర్యవైశ్యులు



యాడికి మే 12 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ): మండల కేంద్రంలోని ఆర్యవైశ్య వీధిలో ఉన్న శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో చైత్ర పౌర్ణమి సందర్భంగా శ్రీశ్రీశ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతం ఇరవై ఒక్క దంపతుల చేతుమీదుగా నిర్వహించడం జరిగింది . పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక హెూదా కార్యక్రమాలు నిర్వహించారు. పేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పంచామృతాభిషేకం, మహా మంగళహారతి పూజలు చేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించడం జరిగింది . ఈ కార్యక్రమం అంతా యాడికి ఆర్యవైశ్య సంఘం , ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు..



## హైమాస్ట్ లైట్లు ప్రారంభం



ఆమనగల్లు(నేటి శుభోదయ): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో శ్రీశైలం జాతీయ రహదారి పై హైమాస్ట్ లైట్లను శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేయటం జరిగింది. నూతన హైమాస్ట్ లైట్లను విఠాయిపల్లి కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ నాయక్,సురేశ్,పర్వతాలు,శ్రీనివాస్ రెడ్డి వెంకటేశ్వర రెడ్డి,వెంకట్ రెడ్డి,రవీందర్ నాయక్,సుదాకర్ రెడ్డి,కృష్ణ,జంగయ్య,లక్ష్మారెడ్డి,దావీద్ ఉన్నారు.

## తెలంగాణలో ఇక ఆస్తుల రిజిస్ట్రేషన్ చాలా సులువు




హైదరాబాద్, **(నేటి శుభోదయ):** తెలంగాణ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కీలక మార్పులు ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఆస్తుల రిజిస్ట్రేషన్ అంటే చాలా పెద్ద తలనొప్పి వ్యవహారం. రోజంతా నిరీక్షించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది ప్రభుత్వం. 47 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. తెలంగాణలో మొత్తం 144 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వచ్చే నెల చివరి నాటికి అన్ని చోట్ల ఈ స్లాట్ బుకింగ్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. త్వరగా సమర్థవంతంగా సేవలు అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సిబ్బందిని నియమిస్తారు. సాధారణంగా రోజుకు 48 స్లాట్లు ఉంటే సబ్ రిజిస్ట్రార్ కు పని ఒత్తిడి ఉండదు. అంత కంటే ఎక్కువ స్లాట్లు బుక్ అయ్యే కార్యాలయాల్లో అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉండే కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను, సిబ్బందిని నియమించారు. త్వరలో ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా అదనపు సబ్ రిజిస్ట్రార్‌ను నియమించనున్నారు. ప్రభుత్వానికి ఆదాయం కల్పించే వాటిలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కీలకంగా ఉన్నాయి. అక్కడ ఉన్న సమస్యల వల్ల ఆదాయం పెరగడంలేదు. అందుకే ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు చేపట్టాలని అనుకుంటోంది.

## రైతు మంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం




ముత్తారం మండల ప్రతినిధి(నేటి శుభోదయ): ముత్తారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ మరియు వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు రసాయనాల వినియోగం,పంట మార్పిడి,సాగునీటి ఆదా,పంట నష్టపరిహారం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూనారం వ్యవసాయ పరిశోధన సంస్థ డాక్టర్ శ్రీధర్ సిద్ది, కరీంనగర్ డాట్ సెంటర్ రాజేంద్రప్రసాద్, తెలంగాణ సీడ్స్ కరీంనగర్ ఆర్ఎం విష్ణువర్ధన్,జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి,మండల వ్యవసాయ అధికారి అనూష,పిఎసిఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు,ఎంపీడీవో సురేష్, హార్టికల్చర్ అధికారి జ్యోతి,మనీషా, హారిక,శ్రీలేఖ,ఏపిఎం పద్మ అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలే

**ఒకరు స్క్రిప్ట్ రాస్తారు,**
**మరొకరు డెలివరీ చేస్తారు**
**ధనిక రాష్ట్రం అంటూ షో చేసి ఆగం చేసింది మీరు కాదా**
**ఉన్న విషయాన్నే సీఎం రేవంత్ రెడ్డి ప్రజలముందుంచారు**
**ప్రతిపక్షాల విమర్శలకు ఒక హద్దు ఉండాలి**
**మున్నేరు బాధితులందరికీ రివర్ ఫ్రంట్ కాలనీలో చోటు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి**
**సోమవారం ఉదయం అధికారులతో కలిసి పనుల పరిశీలన**




ఖమ్మం, నేటి శుభోదయ (మాధవరావు యెగినాటి, నేటి శుభోదయ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ) ::: రిగిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఉదయం మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను



అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రం అంటూ గత పాలకులు షో చేశారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే లోగుట్టు మొత్తం బయట పడిందన్నారు. తినడానికి తిండి లేకున్నా మీసాలకు సంపెంగ నూనె రాసి ప్రజలను మభ్య పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### యథార్థ పరిస్థితినే సీఎం చెప్పారు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల చిట్టా చూసి బాదేసిందని, దాదాపు 8 లక్షల 19 కోట్ల అప్పు ఉందని వెల్లడించారు. ఆ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారని, ఈ రోజు ఉన్న పరిస్థితిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు తెలియాలనే చెప్పారని అన్నారు. ఇంటి పెద్దగా కుటుంబాన్ని సక్రమంగా నడిపించే ప్రయత్నం చేస్తున్నామని, క్యాన్సర్ సోకితే ఒప్పుకోవాలని బయటకు తెలియకపోతే రోగం ముదురుతుందని పేర్కొన్నారు. ఇదే నిజాన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా ఒప్పుకోవాలని సూచించారు.

### విమర్శలకు హద్దుండాలి

పొద్దున లేస్తే అధికార కాంగ్రెస్ పార్టీ మీద ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. సీతారామ ప్రాజెక్టు పనులు తాము పూర్తిచేస్తే కాంగ్రెస్ పార్టీ నీళ్లు చల్లుకుంటుందన్న బీఆర్ఎస్ నేతల మాటలకు పొంగులేటి గట్టి కౌంటర్ ఇచ్చారు. 90 శాతం పనులు పూర్తిచేస్తే ఇంకా 40 శాతం పనులు ఎలా మిగిలి ఉంటాయని ప్రశ్నించారు. కనీసం డ్రైరన్ కూడా చేయని బీఆర్ఎస్ నాయకులు మోటార్లు బిగించారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మేం తప్ప



ఎవరూ ఏమి చేయలేదనే బావనలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారని, చివరకు గాలిని కూడా మేమే కనుగొన్నామని అంటారేమోనని ఎద్దేవా చేశారు. గాలిని, నీటిని, ప్రజలు తినే ఆహారాన్ని మేమే కనుగొన్నామని అంటే ఎలా అని ప్రశ్నించారు. విమర్శలు చేయాలి తప్పు కాదు. కానీ చేసే విమర్శ సోయీపసొంపుతో ఉండాలన్నారు.

### కుట్రలు జరుగుతున్నాయి

కాంగ్రెస్ ప్రభుత్వానికి క్రెడిట్ రావద్దని విపక్షాలు కుట్రలకు పాల్పడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెరవెనుక ఉండి కొందరు రైతులను ఉసిగొలుపుతున్నారని ప్రతిపక్ష నాయకులపై ధ్వజమెత్తారు. ఎవరెవరు కుట్రలకు పాల్పడు తున్నారో అన్ని విషయాలు అధికారుల వద్ద పూర్తి సమాచారంతో ఉందన్నారు. ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పారని, ఇకనైన సక్రమంగా మసలుకోవాలని హితవు పలికారు.

### రివర్ ఫ్రంట్ కాలనీతో భరోసా

గతేడాది అకాల వర్షాలకు మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో నివాసముండే వేలాది కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురయ్యాయని, సీఎం రేవంత్ రెడ్డి సహా అనేక మంది మంత్రులు మున్నేరు




బాధితులను పరామర్శించి, ఆదుకుని రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగం చేశామన్నారు. తక్కువ ధరకు వస్తుందని ఇక్కడ భూములు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్న పేదలకు రిటైనింగ్ వాల్ తో భరోసా ఉంటుందన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా రివర్ ఫ్రంట్ కాలనీలో చోటు కల్పిస్తామని చెప్పారు. 450 నుంచి 500 ఎకరాల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది రిటైనింగ్ వాల్ నిర్వాసితులకు అందులో స్థానం కల్పిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా జీవో ఇచ్చి వదిలేస్తే రిటైనింగ్ వాల్ ప్రియారిటీని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెండు వైపులా 17 కిలోమీటర్ల మేర భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. రిటైనింగ్ వాల్ కు రెండు వైపులా డ్రైనేజీ నిర్మాణం కూడా చేపడుతామని వెల్లడించారు. మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో భూములున్న ఆసాములు ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని,ప్రభుత్వం చిత్తశుద్ధితో పేదల పక్షాన ఉంటుందన్నారు.

# ప్రణాళికాబద్ధంగా భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**మున్నేరు భూ నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధి చేయాలి**
**సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నదీ భూ సేకరణ, ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం,**(నేటి శుభోదయ):** సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు ప్రణాళికాబద్ధంగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా



కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నదీ భూ సేకరణ, ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధిపై జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ పి.



శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన మొత్తం భూమి, వీటిలో అసైన్డ్ ప్రభుత్వ పట్టా ఎంత ఉంది, ప్రైవేట్ పట్టా భూమి ఎంత సేకరించాలో స్పష్టమైన సమాచారంతో నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ భూమి ఎంత సేకరించాలో వివరాలు అందిస్తే ప్రత్యామ్నాయ భూములలో అటవీ పెంపకం చర్యలు చేపడతామని అన్నారు. జిల్లాలో మండలాల వారీగా సేకరించాల్సిన అటవీ భూమి, అసైన్డ్ ప్రభుత్వ భూములు, ప్రైవేట్ పట్టా భూముల వివరాలతో నివేదిక శుక్రవారం నాటికి అందించాలని కలెక్టర్ తెలిపారు. భూ సేకరణలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూముల సేకరణ సర్వే నిమిత్తం డిజిపిఐ ఆధునిక సర్వే యంత్రాలతో సర్వేయర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేసి జూన్ 12 నాటికి వివిధ కేటగిరీల వారీగా భూ సేకరణకు సంబంధించిన తుది నివేదిక తయారు చేయాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి 11 విద్యుత్ స్తంభాలు, నాలుగు టవర్ లు షిఫ్టింగ్ కు సంబంధించిన ప్రతిపాదనలు అందించాలని, దీనికి అవసరమైన చెల్లింపులు విద్యుత్ శాఖకు వారం రోజులలో చేపట్టాలని, సంబంధిత పనులు రాబోయే వర్షాకాలం లోపు పూర్తి చేయాలని అన్నారు. మున్నేరు నదీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం రైతులకు, నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. మే 25 నాటికి ప్రజలను క్షేత్ర స్థాయిలో తీసుకుని వెళ్లి లేఔట్ చూపించాలని అన్నారు. రాబోయే వర్షా కాలం లోపు నిర్ణీత పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఎటువంటి గ్యాప్స్ ఉండటానికి వీలు లేదని, మున్నేరు నది రిటైనింగ్ వాల్ 17 కిలో మీటర్ల స్ట్రెచ్ లో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించాలని





అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం, ప్రత్యామ్నాయ లేఔట్ భూ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని దశల వారీగా అవసరమైన నిధుల వివరాలు త్వరగా చెల్లింపులు అయ్యేలా చూస్తామని అన్నారు. ప్రజలకు అందించే భూములలో లేఔట్ అభివృద్ధి అంతర్గత రోడ్లు, కనెక్టివిటీ అంశాలు ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మనసు దోసేశారు సార్

**సాదా సీదాగా రోడ్డు వెంట బండి వద్ద టిఫిన్ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**



అశ్వారావుపేట,**(నేటి శుభోదయ):** హంగు ఆర్భాటానికి దూరంగా ఉంటూ ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమయ్యే ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి. సోమవారం ఉదయం రోడ్డు వెంట టిఫిన్ బండి వద్ద దోస తిన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి వెళుతూ పోలీస్ స్టేషన్ రింగ్ సెంటర్ లో ఆగారు. రోడ్డు వెంట ఉన్న టిఫిన్ బండి వద్దకు ఓ సామాన్యుడి మాదిరి గా వెళ్లి హాఫ్ దోస, సింగల్ ఇడ్లీ తినగా సార్ భలే సింపుల్ అంటూ స్థానికులు ఒకింత ఆశ్చర్యంగా చూశారు. అక్కడున్న స్థానిక ఆదివాసీ యువతను ఆప్యాయంగా పలకరించగా వారంతా ఎంపీ తో సెల్ఫీలు తీసుకుని ఆనందించారు.



## మాల కొండయ్య కు ఘనంగా నివాళులర్పించిన దారపనేని

నేటి శుభోదయ ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ పామూరు): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు పంచాయితీ పోతవరం గ్రామ టిడిపి నాయకులు, ఒంగోలు వెంగమాంబ ఆటో ఫైనాన్స్ అధినేత చెనికల మాలకొండయ్య (చిన్నోడు) ఆకస్మిక మృతి పట్ల కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాలకొండయ్య మృతి తీరని లోటు అని మాలకొండయ్యకు దారపనేని ఘనంగా నివాళులు అర్పించారు. మాల కొండయ్య సతీమణి, కుమారుడు మనోహర్ కు దారపనేని మనోధైర్యం కల్పించారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మోరు బోయిన గంగరాజు యాదవ్, గిడ్డయ్య యాదవ్, మోపాడు నీటి సంఘం చైర్మన్ నరసింహారావు యాదవ్, మోహన్ రావు యాదవ్, కొండయ్య యాదవ్, తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య, చిన్న మాల కొండయ్య, కొండయ్య (కరణం) నాగేశ్వరరావు, శ్రీనివాసులు, మానం మల్లికార్జునరావు, తిరివీధి కేశవులు (కర్నూలు) ఖాజా, గోళ్ళ రమణయ్య (వైజాగ్) నూతలపాటి బాలయ్య, మానం నాగమల్లేశ్వరరావు, తోడేందుల వెంకటేశ్వర్లు చెనికల నాగయ్య, సుధాకర్ రెడ్డి, తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



# ప్రజలు ఎదురు చూస్తుంటే

## అధికారులు మాత్రం గైర్హాజరు



ఏన్కూరు,(నేటి శుభోదయ): ప్రతి సోమవారం మండల కేంద్రాల్లోని తహశీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమం అంతంతమాత్రంగానే కొనసాగుతుంది. గత రెండు రోజుల నుంచి ప్రభుత్వ ఆఫీసులకు సెలవు. సోమవారం నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల చెందిన 21 మంది అధికారులు హాజరు కావాల్సి ఉండగా 12 శాఖల అధికారులు హాజరయ్యారు. హాజరైన వారిలో సైతం మండల అధికారి ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనకుండా వారికి బదులు క్రింది స్థాయి అధికారులు హాజరు కావడం గమనార్హం. హాజరు కాని అధికారుల్లో కొన్ని శాఖల అధికారులు మీటింగ్ నిమిత్తం వెళ్లడంతో హాజరు కాలేక పోతుంటే కొన్ని శాఖల అధికారుల తీరు మాత్రం అస్సలు మారడం లేదు. మేము ఇంతే మేము మారం అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాపాలనకు హాజరు కాకపోయినప్పటికీ ఈ శాఖల అధికారుల పై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదో తోటి ఉద్యోగులకు కూడా అర్థం కాని ప్రశ్న. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ప్రజాపాలనలో మండలంలోని ప్రజలు వివిధ శాఖల అధికారులకు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఇదో అవకాశంగా ఉండేది. హాజరు కాని అధికారుల పట్ల కలెక్టర్ ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ శేషగిరిరావును వివరణ కోరగా కొంతమంది అధికారులు ముందస్తు సమాచారం మేరకు హాజరు కాలేదని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి ముందు ఎలాంటి సమాచారం ఇవ్వని అధికారుల లిస్టు జిల్లా ఉన్నతాధికారులకు పంపుతారని తెలిపారు.

## ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు ఎస్ ఐ రఘునాథ్ ను ఆహ్వానించిన తోటల చెరువుపల్లి గ్రామస్తులు



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) (వరికుంటపాడు/ఉదయగిరి): వరికుంటపాడు మండలం తోటల చెరువుపల్లి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు వరికుంటపాడు ఎస్ ఐ ఎం.రఘునాథు ను ఆహ్వానించిన తోటల చెరువుపల్లి గ్రామ ఆలయ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో సుంకే మోహన్ రావు, సభాపతి, పగడాల హజరత్తయ్య, జానీ తదితరులు పాల్గొన్నారు

## మేకపాటి రాజగోపాల్ రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన ముల్లంగి



నేటి శుభోదయ( ఏపీ బ్యూరో చంద్ర)( వరికుంటపాడు/ ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి ని బెంగళూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 21వ తేదీన జరుగు ముల్లంగి వారి వివాహ వేడుకలకు హాజరుకావాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన వరికుంటపాడు మండలం తోటల చెరువుపల్లి వైసిపి యువ నాయకులు, ఎస్ ఆర్ఎం అధినేత ముల్లంగి శ్రీనివాసులు. ఈ కార్యక్రమంలో వరికుంటపాడు మండల జెసిఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర రెడ్డి, షేక్ మునాఫ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కారించాలి

### - ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఖమ్మం,(నేటి శుభోదయ): ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన జయమ్మ ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో ముందు తన పేరు వచ్చిందని, తర్వాత తొలగించారని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నాగులవంచ రెవెన్యూ గ్రామానికి చెందిన జి. రాములు తనకు సర్వే నెంబర్ 279అ/1/1 లో ఎకరం 10 గుంటల భూమి ఉందని, నాగులవంచ చొప్పకట్లపాలెం రోడ్డు 4 అడుగుల ఎత్తులో వేస్తున్నారని, దీనివల్ల తన





భూమితో పాటు 100 ఎకరాలకు పైగా పంట నష్టం జరుగుతుందని, పంట పొలాలు వర్షపు నీరుకు మునిగిపోకుండా తూములు వేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు రాస్తూ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ఏన్కూర్ మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన రామారావు తాను దివ్యాంగ నిరు పేదనని ఎంఏ, బీఈడి పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణిలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## కాపునాడు లీగల్ సెల్ మచిలీపట్నం పార్లమెంటరీ అధ్యక్షునిగా చింతా రత్నశేఖర రావు



మచిలీపట్నం, మే 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ఆంధ్రప్రదేశ్ కాపునాడు మచిలీపట్నం పార్లమెంటరీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా గుడివాడకు చెందిన ప్రముఖ న్యాయవాది చింత రత్నశేఖర రావు ను నియమిస్తూ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మల్లెమూడి సతీష్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. యువ న్యాయవాదిగా, వివిధ కాపు సంఘాలలో చురుగ్గా పనిచేసిన అనుభవం కలిగిన చింతా రత్నశేఖరరావును లీగల్ సెల్ అధ్యక్షునిగా కాపునాడు ఆర్గనైజేషన్లో నియమించడం పట్ల పలువురు కాపు ప్రముఖులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చింత రత్నశేఖర రావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు గాళ్ళ సుబ్రహ్మణ్యం, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మల్లెమూడి సతీష్ బాబులు తనను మచిలీపట్నం పార్లమెంటరీ కాపునాడు లీగల్ సెల్ అధ్యక్షునిగా నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి సంఘానికి, సమాజానికి, కాపు జాతికి మంచి పేరు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. చింత రత్న శేఖర్ నియామకం పట్ల గుడివాడ పట్టణ పరిసర ప్రాంత కాపు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## మున్నేరు నదీ పరివాహక ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం

**తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**సుమారు 676 కోట్లతో వేగంగా జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు**

**మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి పొంగులేటి**

ఖమ్మం, (నేటి శుభోదయ): మున్నేరు నదీ పరివాహక ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రిటైనింగ్ వాల్



నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం మంత్రి, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదల కారణంగా మున్నేరు నదీ పరివాహకంలోని వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయని, దీనిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంకల్పించిందని అన్నారు. పేదలు, సామాన్య ప్రజలు మున్నేరు నదికి ఇరువైపులా జీవిస్తున్నారని, వరదల కారణంగా వారి కష్టం వృధా అవుతుందని, గత ప్రభుత్వ పెద్దలు కేవలం జీఓ జారీ చేసి



చేతులు దులుపుకుంటే, ప్రజా ప్రభుత్వం సీఎం ఆదేశాల ప్రకారం స్థానికంగా వచ్చే వరదను కూడా అంచనా వేస్తూ నదికి ఇరువైపులా 17 కిలో మీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని అన్నారు.



రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఉన్న చిన్న, చిన్న అడ్డంకులను కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం పగలు, రాత్రి కష్టపడి పరిష్కరిస్తున్నారని తెలిపారు. మున్నేరు నదీ పరివాహక కుటుంబాలకు భవిష్యత్తు లో ఎటువంటి ఇబ్బంది కలుగవద్దని ప్రభుత్వ ఉద్దేశమని, శాశ్వత పరిష్కారం కోసం సుమారు 676 కోట్లతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. 4155 మీటర్ల ఎర్త్ వర్క్, 3495 నీటర్ల సిమెంట్ కాంక్రీట్ పనులు ఇప్పటివరకు పూర్తయ్యాయన్నారు. మున్నేరు నదీ రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భూములు కోల్పోయే వారిని ఇబ్బంది పెట్టే ఆలోచన ప్రభుత్వానికి లేదని, నిర్వాసితులైన నిరుపేదలకు ఎక్కడ ఇబ్బంది, నష్టం రాకుండా



రివర్ ఫ్రంట్ లోనే పోలేపల్లి వద్ద అద్భుతమైన కాలనీ ఏర్పాటు చేసి ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. రిటైనింగ్ వాల్ కు బయటి వైపు ఇరువైపులా డ్రైయిన్, బీటీ రోడ్డు ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేసినట్లు తెలిపారు. దశాబ్దాల కాలంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు రక్షణ కల్పించే విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. అనంతరం మంత్రి జలగం నగర్,



నాయుడుపేట వద్ద తీగలవంతెన పనుల పురోగతిని పరిశీలించారు. పనులు నాణ్యతతో, అగ్రిమెంట్ తేదీలోగా పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, మిషన్ భగీరథ ఇఇ వాణిశ్రీ, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్ కుమార్, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**9 వేల కోట్లతో యువతకు స్వయం ఉపాధి యూనిట్ ల ఏర్పాటు**

**తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను అందజేసిన మంత్రి పొంగులేటి**

ఖమ్మం, (నేటి శుభోదయ): నిరుపేదలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉండి, ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా తగిన సహాయం అందజేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల



మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను అందజేసారు. తిరుమలాయపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని



64 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు లక్ష 116 రూపాయల చొప్పున చెక్కులను, 57 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు మొత్తం 18 లక్షల 65 రూపాయల విలువ గల చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా ఉండేందుకు చిత్తశుద్ధితో ప్రభుత్వం పని చేస్తుందని, ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదల కష్టాలలో పాలు పంచుకోవాలని కళ్యాణలక్ష్మితో పాటు, ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని, ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ క్రింద గడచిన సంవత్సర కాలంలో 1056 కోట్లు విడుదల చేసిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు



మంజూరు చేస్తామని అన్నారు. మే నెలాఖరు వరకు అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపడతామని, నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం కార్యక్రమం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 4 వేల మందికి చేయూత నిచ్చి రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల కోట్లు ఖర్చు చేసి సబ్సిడీ యూనిట్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం గోపాయిగూడెంలో ఎస్.డి.ఎఫ్. నిధులు 13.50 లక్షలతో నిర్మించనున్న మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గది నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని, తరుగు పేరిట కటింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. మేడిదపల్లి గ్రామం ఎస్.సి. కాలనీలో 16



లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, తిమ్మక్కపేటలో 35 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, ఎర్రగడ్డ ఎస్.సి. కాలనీలో 30 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్రనీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఏడిఏ సరిత, తిరుమలాయపాలెం ఎంపిడివో ఎస్కె. సిలార్ సాహెబ్, ఇంచార్జ్ తహసీల్దార్ సుధీర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత అన్ని రంగాల్లో ముందుండి తమ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలి

**గుండాల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లందు డిఎస్పి చంద్రభాను.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ఇల్లందు, మే 12,(నేటి శుభోదయ): ,జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా గుండాలలో పోలీసుల ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఈ రోజుతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇల్లందు డిఎస్పి ఎన్.చంద్రబాను హాజరయ్యారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్లో గుండాల, ఆళ్లపల్లి, కొమరారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. ఈ 40 జట్లలో ఫైనల్ కు దామరతోగు మరియు చిన్న వెంకటాపురం జట్లు చేరుకున్నాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ ఫైనల్ మ్యాచ్ నందు రెండు జట్లు హోరాహోరీగా పోరాడినాయి. రెండు జట్లలో దామతోగు జట్టు విజేతగా నిలిచింది.మొదటి స్థానంలో నిలిచిన దామరతోగుకు జట్టుకు బహుమతిగా 15000/- రూపాయలు మరియు షీల్డ్ అందజేశారు. చిన్న వెంకటాపురం జట్టుకు ద్వితీయ బహుమతిగా 10,000/-ల రూపాయలు మరియు షీల్డ్ అందజేయడం జరిగింది.మామకన్ను జట్టుకు తృతీయ బహుమతిగా 6000/-ల రూపాయలు మరియు షీల్డ్ ను అందజేయడం జరిగినది.ఈ సందర్భంగా ఇల్లందు డిఎస్పి చంద్రబాను గారు మాట్లాడుతూ ఏజెన్సీ యువత చెడు మార్గాల జోలికి పోకుండా చదువు, క్రీడలపై దృష్టి పెట్టాలి అని తెలిపారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని కోరారు.ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి



చెందాలని పోలీసు వారు తమ వంతు భాధ్యతగా క్రీడా పోటీలు,మెడికల్ క్యాంపులు, రోడ్డులు, కమ్యూనిటీ హాళ్లు,క్రీడాస్థలాల ఏర్పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించిన గుండాల సీఐ రవీందర్,యస్ఐ రవూఫ్ మరియు గుండాల సిబ్బందిని అభినందించారు.

## సెలవులు ప్రకటించిన ఏపీ హై కోర్ట్

విజయవాడ, మే 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): హైకోర్టుకు ఈ నెల 12 నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. తిరిగి జూన్ 16 నుంచి పూర్తిస్థాయి కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసర వ్యాజ్యాల విచారణకు వెకేషన్ కోర్టులు ఏర్పాటు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మొదటి దశ వెకేషన్ కోర్టులు ఈ నెల 15, 22, 29వ తేదీల్లో విచారణలు చేపడతాయి. ఇందులో భాగంగా మే 15, 22వ తేదీల్లో న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా విచారణలు చేయనున్నారు. మే 29న జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా కేసులు విచారించనున్నారు. రెండోదశ వెకేషన్ కోర్టులు జూన్ 5, 12వ తేదీల్లో విచారణ చేపడతాయి. జూన్ 5, 12వ తేదీల్లో జస్టిస్ జస్టిస్ ఎం.కిరణ్మయి, జస్టిస్ టి.సి.డి.శేఖర్ డివిజన్ బెంచ్, జస్టిస్ కుంచం మహేశ్వరరావు సింగిల్ బెంచ్ నిర్వహిస్తారు.

## ఈనెల 15 నుంచి ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ?

**(నేటి శుభోదయ):** ఆంధ్రప్రదేశ్ కూటమి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.ఉపాధ్యా యులబదిలీలకు సంబంధించిన ప్రక్రియపై ఫోకస్ పెట్టింది.ఈనెల 15 నుంచి ఆన్ లైన్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. సర్వీసుకు ప్రామాణిక తేదీగా మే31 గా నిర్ణయించింది. మే31 నాటికి ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, అయిదేళ్ల సర్వీసు హెచ్ఎంలకు తప్పనిసరిగా బదిలీలు ఉంటాయన్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## వెదురుకుప్పం ఎంపీడీవో గా లక్కెపోగు పురుషోత్తం మాస్టారు



విస్సన్నపేట : (నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్): విస్సన్నపేట మండలం స్థానిక ఇందిరానగర్ కి చెందిన లక్కేపోగు పురుషోత్తం పంచాయతీరాజ్ శాఖలో ఇటీవల జరిగిన పదోన్నతులులో భాగంగా చిత్తూరు జిల్లా వెదురకుప్పం డిప్యూటీ ఎంపీడీవో(ఈవోపిఆర్ డి)గా పనిచేయుచున్న ఎల్ పురుషోత్తం ఎంపీడీఓ గా పదోన్నతి పొంది అదే మండలం వెదురుకుప్పం నందు జాయిన్ అయినారు.పురుషోత్తం గతంలో ఉమ్మడి కృష్ణా జిల్లా విస్సన్నపేట ప్రభుత్వ కళాశాల నందు 1993 నుండి ఒకేషనల్ కోర్స్ సివిల్(సి టి) అధ్యాపకునిగా 28 సంవత్సరాలు సుదీర్ఘంగా పని చేసి వందలాది మంది విద్యార్థులను తనకున్న అపారమైన జ్ఞాన సంపదతో ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్ది జనరల్ నాలెడ్జి మాస్టర్ గా పేరొందినారు ఒక వైపు ఆధ్యాపకునిగా కొనసాగుతూ,గ్రూప్స్ వ్రాసి 2021 అక్టోబర్ 4న ఈవోపిఆర్డి గా చిత్తూరు జిల్లా వెదురు కుప్పం నందు భాధ్యతలు తీసుకోవటం జరిగింది ఇంత తక్కువ కాలంలోనే ఎంపీడీఓ గా పదోన్నతి పొందిన లక్కెపోగు పురుషోత్తంను వారి కుటుంబ సభ్యులుతోపాటు,బంధుమిత్రులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు అభిమానులు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం




ఆమనగల్లు(నేటి శుభోదయ): ఆమనగల్లు పట్టణంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్ లో సోమవారం వైద్యాధికారుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది.సిహెచ్.సి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు,డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టర్ మంజులాదేవిల ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ సందర్భంగా వైద్యరంగంలో నర్సింగ్ సర్వీసెస్ కేటగిరిల్లో ఉత్తమ సేవలందించిన ఎ.ఎన్.ఎం లు,స్టాఫ్ నర్సులు,హెడ్ నర్సులకు మరియు సిహెచ్ సి,పిహెచ్.సి నర్సింగ్ అధికారులకు డాక్టర్ నాగరాజు,డాక్టర్ మంజులాదేవి శాలువాలతో ఘనంగా సత్కరించి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు,వైద్య సిబ్బంది,ఆశాలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మినారాయణ స్వామి కల్యాణం



దమ్మపేట ప్రతినిధి(**నేటి శుభోదయ):** దమ్మపేట మండల పరిధిలో గల నాగుపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనారాయణస్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం సోమవారం ఉదయం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి దేవాలయ కమిటీ వారి ఆధ్వర్యంలో ముఖ్యంగా నాగుపల్లి గ్రామ పరిసర ప్రాంతాల నుండి వచ్చిన భక్తుల మధ్య ఉదయం నుండి ఆరాధన, భాలభోగ నివేదన, కంకణ ధారణ కార్యక్రమాల అనంతరం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, చూడముచ్చటగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు పోశారు. అనంతరం పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి కల్యాణం తిలకించి, ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. స్వామి వారి కళ్యాణం ని భక్తి శ్రద్ధలతో పాల్గొన్న భక్తులు మహా అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం నాగుపల్లి గ్రామంలో స్వామి వారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నాగుపల్లి గ్రామ, దమ్మపేట మండల పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం కళ్యాణ్ లక్ష్మి, షాద్ ముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం రేగోడ్



రేగోడ్ :మే,12(నేటి శుభోదయ ప్రతినిది శ్రీనాథ్ చారి): తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు రేగోడు మండల ప్రజా పరిషత్ లో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిగంబర్ పటేల్, పీసీసీ సభ్యులు మున్నూరు కిషన్ ఆధ్వర్యంలో కళ్యాణ్ లక్ష్మి, షాద్ ముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్దరులకు 35 లక్షల నాలుగు వేల 60 రూపాయలు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని మండల అధ్యక్షుడు దిగంబర పటేల్, పీసీసీ సభ్యులు మున్నూరు కిషన్ తెలిపారు. మీరు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని పేదవాళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దత్తు రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు చోటిమియా, మండల ఉపాధ్యక్షులు గున్న సంగమేశ్వర్ సేటు, మార్కెట్ డైరెక్టర్ సంగన్న, పాజిల్, మండల యూత్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్టీ అధ్యక్షులు పీరి నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈశ్వరప్ప, అంజయ్య, మాజీ సర్పంచులు రాములు, విట్టల్, దర్శనం, మాజీ ఎంపిటిసిలు నాగిరెడ్డి, గాండ్ల నర్సింలు, మాజీ పీఏసీఏ చైర్మన్ శ్యామ్ రావు దొర, సంఘ నాయక్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు



## ఎండ వేడిమిలో ప్రయాణికుల అవస్థలు

### పెడనలో చలువ పందిళ్లను మరిచిన మున్సిపాలిటీ



పెడన, మే 12: ( అజయ్ నారగాని - నేటి శుభోదయ): వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగిన నేపథ్యంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏడాది వేసవికాలంలో చలువ పందిళు ఏర్పాటు చేయడం మున్సిపాలిటీ సాధారణపు పని అయినా, ఈ సంవత్సరం ఆ ఏర్పాట్లను మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా మరిచిపోయారని స్థానికులు విమర్శిస్తున్నారు. పెడన రైల్వే గేటు దగ్గర ట్రాఫిక్ నిలిచిపోతే కనీసం 15 నుంచి 20 నిముషాలు వేచి ఉండాల్సి వస్తోందని, ఈ సమయంలో ఎండ వేడి కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర అస్వస్థతకు లోనవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు మరియు గర్భిణులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.

## హెూంగార్డు కుటుంబానికి బీమా చెక్ అందచేత

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి మే 12(**నేటి శుభోదయ):** శ్రీనాథ్ చారి...సంగారెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయంలో పనిచే స్తూ హెూంగార్డ్ మచ్చేందర్ గత సంవత్సరం డిసెంబర్ 31న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన హెూంగార్డు మచ్చేందర్ కుటుంబానికి యాక్సిస్ బ్యాంక్ తరఫున యాక్సిడెంట్ పాలసీ డెత్ కింద 34 లక్షల రూపాయలను అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ నుండి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ త్వరగా అందే విధంగా చేస్తామని పోలీస్ శాఖ వారికి కుటుంబానికి ఎల్లవేళలా సాయ సహకారాలు అందించడం జరుగుతుందని అన్నారు. అధికారులు సిబ్బంది పోలీస్ శాలరీ ప్యాకేజ్ గురించి అవగాహన కలిగి ఆయా బ్యాంకులలో ఉన్న శాలరీ అకౌంట్లను పోలీస్ శాలరీ ప్యాకేజీ లోకి మార్చుకోవాల్సిందిగా సూచించారు మచ్చేందర్ మరణానంతరం రావాల్సిన యాక్సిడెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందించిన యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ బ్యాంక్ యాజమాన్యానికి ఎస్పీ అభినందించారు ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి కళ్యాణి ఆర్ ఐ డానియల్ రాజశేఖర్ రెడ్డి యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ సిబ్బంది మచ్చేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## భూ భారతి తోనే భూ సమస్యలకు పరిష్కారం

## సంతోషం వ్యక్తం చేస్తున్న రైతు

### గత ధరణి లో సాంకేతిక నిషేధిత భూమి

### నేటి భూ భారతిలో రైతు సొంత భూమి.

### ఏండ్ల నాటి భూ సమస్యను పరిష్కరించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

### ప్రజావాణిలో నే రైతుతో తంబు (వేలిముద్ర) వేయించి భూ పట్టా పంపిణీ చేసిన అదనపు కలెక్టర్ మాధురి

### సంతోషం వ్యక్తం చేసిన రైతు ,రైతు కుటుంబ సభ్యులు




సంగారెడ్డి మే 12(నేటి శుభోదయ ప్రతినిధి (శ్రీనాథ్ చారి): సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్ల మచ్చనూర్ గ్రామానికి చెందిన బేగరి శివయ్యకు సర్వేనెంబర్ 267/అ లో13 గుంటల పట్టా భూమి ఉంది. అయితే 2018 నుంచి ధరణిలో భూ వివరాలు పరిశీలిస్తే ఆ భూమి ధరణి సాంకేతిక నిషేధిత జాబితాలో ఉంది. ఆ రైతు సార్లు అధికారుల చుట్టూ కోట్ల చుట్టూ తిరిగి తిరిగి సమస్య పరిష్కరించక అలసిపోయాడు. గత మాసంలో ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశాడు. ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించే విధానంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రత్యేకత చొరవ చూపుతూ ఈ సమస్యను ధరణి సాంకేతిక నిషేధిత సమస్య నుండి నేటి భూభారతి చట్టం తో ఆ సమస్యను వెంటనే పరిష్కరించి నిషేధిత జాబితా నుండి రైతు సొంత భూమిగా మార్చి నేటి ప్రజావాణి కార్యక్రమంలోనే తంబు (వెలిముద్ర) వేయించి సమస్యను చాలా త్వరగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిష్కరింపజేశారు. పరిష్కరించిన సమస్యను రైతు పట్టా భూమి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మాధురిలి రైతుకు అందజేశారు. 2018 నుంచి ఈ సమస్య ఉందని ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగానని సమస్య పరిష్కారం కాలేదని నేటి ప్రజావాణిలో తన సమస్య పరిష్కారం దొరకడంతో సంతోషంగా ఉందన్నారు జిల్లా కలెక్టర్ గారికి రైతు బేగరీ చిన్న శివయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఈత కొలనుల వద్ద పిల్లలతో జాగ్రత్తగా ఉండాలి

### ఈత సరదాతో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు

### కేశంపేట సిఐ నరహరి




కేశంపేట ప్రతినిధి (నేటి శుభోదయ): వేసవి సెలవులలో గ్రామాల సమీపంలోని చెరువులలో కుంటలతో పాటు ఈత కొలనుల వద్ద ఈతరానీ పిల్లలతో జాగ్రత్తగా ఉండాలని కేశంపేట సీఐ నరహరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవులు ఉండటంతో పిల్లలు సరదాగా ఈత నేర్చుకోవడానికి చెరువులలో కుంటలతో పాటు స్విమ్మింగ్ పూల్ లో దిగి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. పిల్లలను తల్లిదండ్రులు ఎక్కడికి వెళుతున్నారని విషయాన్ని ఎప్పుడూ తెలుసుకుంటూ ఉండాలని తెలిపారు. మండలంలోని ఈతకొలను నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా నివారించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. మండలంలో ఎలాంటి ప్రమాదాలు సంభవించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం మరియు శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 1000 మందికి ఉచిత మజ్జిగ పంపిణీ

గుంటూరు జిల్లా మంగళగిరి సచివాలయం అమరావతి ప్రతినిధి(**నేటి శుభోదయ):** శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం మరియు శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమబుద్ధా రోడ్డు వద్ద శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం కార్యాలయం ప్రాంగణంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్, శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా 1000 మందికి మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు అనంతరం సంఘ అధ్యక్షులు పందేటి సాంబశివరావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో సేవాగుణంతో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రారంభం నుండి నిర్విరామంగా ప్రతిరోజు పాదచారులకు, వాహనదారులకు ఉచితంగా చల్లటి మినరల్ వాటర్ ను అందించడంతోపాటు దాతల సహకారంతో ప్రతి సోమవారం 1000 మందికి పైగా పాదచారులకు, వాహనదారులకు ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశ్యంతో తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ బృహత్తర కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న దాతలు, ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు, నంగళం ప్రసాద్, కర్నాటి శివసత్య నారాయణ, నల్లమోలు నాగరాజు, రమాదేవి, నల్లమోలు సుబ్రహ్మణ్యం,ఘగ్గా శ్రీనివాసరావు, పెరుమాళ్ళసుబ్రమణ్యం, పంచల శివన్నా రాయణ, కల్వకొల్లు గోపీ, బేతపూడి మధుబాబు, దుంపల సోములు, నంద్యాల గోపాలకృష్ణ, రెడ్డి వీరరాఘవులు, ఉద్దంటి మురహరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు





## కోటపాటి వారి వివాహ వేడుకలో పాల్గొన్న

### పామూరు పట్టణ ప్రముఖులు



నేటి శుభోదయ ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ పామూరు):విజయవాడలో జరిగిన కోటపాటి జనార్దన్ రావు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపిన పామూరు పట్టణ టిడిపి నాయకులు, ప్రముఖులు. ఈ కార్యక్రమంలో యారవ శ్రీనివాసులు, డి.వి మనోహర్, దర్శి రాము, దర్శి సుబ్రహ్మణ్యం, సోమిశెట్టి వెంకట నారాయణ,పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ,గుత్తి మహేష్, పోలు బాల గురవారెడ్డి, ఒంగోలు చిట్టిబాబు, ఆంజనేయ రెడ్డి, గుత్తి రాజా, షేక్ సందాని, సరాబు చంద్ర తదితరులు పాల్గొన్నారు





## ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

### కలెక్టర్ క్రాంతి వల్లూరు

### ప్రజావాణిలో ( 73 ) దరఖాస్తుల స్వీకరణ



సంగారెడ్డి మే 12 (నేటి శుభోదయ శ్రీనాథ్ చారి ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని కలెక్టర్ అన్నారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లురెవెన్యూ మాధురి, చంద్ర శేఖర్, డిఆర్ఓ పద్మజారాణి, ఇతర అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 73 దరఖాస్తులు వచ్చాయని అట్టి వినతులను సంబంధిత శాఖ అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు తమ వినతులకు తప్పకుండ పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని అధికారులు ప్రజలకు కలిగించేలా ప్రత్యేక శ్రద్ధ వహించి.. క్షేత్ర స్థాయిలో త్వరగా విచారణ చేసి వివిధ సమస్య ల పైన వచ్చిన వినతులకు పరిష్కారం చూపాలన్నారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ జిల్లా అధికారులు కలెక్టరేట్ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కచ్చితంగా అనుసరించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే అధికారులు సమయపాలన పాటిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చు అన్నారు. బయోమెట్రిక్ హాజరు కోసం ఇంకా రిజిస్టర్ చేసుకొని అధికారులు ఎవరైనా ఉంటే త్వరగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. బయోమెట్రిక్ హాజరు అనుసరించకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవు అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా అధికారులు రెవిన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోటపాటి వారి వివాహ వేడుకలో పాల్గొన్న పామూరు పట్టణ టిడిపి మహిళా నేతలు



నేటి శుభోదయ ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ పామూరు): విజయవాడలో జరిగిన కోటపాటి జనార్దన్ రావు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపిన పామూరు పట్టణ టిడిపి మహిళా నేతలు.ఈ కార్యక్రమంలో బొల్లా మున్ని, ఆవుల రమణమ్మ, మద్దిశెట్టి రమాదేవి, జగదాబి రవణమ్మ, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు

## పౌల్ట్రీ ఫారంలో ప్రమాదం... వ్యక్తి మృతి...పలువురికి గాయాలు



కేశంపేట ప్రతినిధి (నేటి శుభోదయ): పౌల్ట్రీ ఫారంలో జరిగిన ప్రమాదంలో పౌల్ట్రీ ఫారం యజమాని మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన కేశంపేట మండలం కాకునూరు గ్రామ శివారులోని లీల్యా నాయక్ పౌల్ట్రీ ఫారంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో పాటు వీచిన గాలులకు పౌల్ట్రీ ఫారం లోని కోళ్ల దాన పరికరం ఒక వైపుకు ఒరిగిపోయింది.అది గమనించిన పౌల్ట్రీ ఫారం యజమాని ఉడిత్యావత్ లీల్య నాయక్ పౌల్ట్రీ ఫారం వర్కర్లతో కలిసి దాన పరికరాన్ని సరిచేయడానికి ప్రయత్నించారు.ఈనేపథ్యంలో దాన పరికరానికి ఉన్న చక్రాలు జారిన కారణంగా ఆదాన పరికరం అందరిపై పడింది.ఈఘటనలో పౌల్ట్రీ ఫారం యజమాని లీల్య నాయక్ పై దాన పరికరం పూర్తిగా పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు.ఒక కార్మికుడికి కాలు విరిగింది.పలువురికి గాయాలయ్యాయి.లీల్యా నాయక్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్ లో షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ లీల్యా నాయక్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సోమవారం పోస్టుమార్టం నిమిత్తం లీల్యా నాయక్ మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు,ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ప్రజావాణిలో(46) ఫిర్యాదులు

### అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు

### జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అధికారులను ఆదేశించారు



ఇబ్రహీంపట్నం మే 12 (నేటి శుభోదయ): సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి



సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ - 21, ఇతర శాఖలకు - 25, మొత్తం 46 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు

## కోటపాటి వారి వివాహ వేడుకలో పాల్గొన్న కొండిశెట్టి రమణయ్య



నేటి శుభోదయ ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ పామూరు): విజయవాడలో జరిగిన కోటపాటి జనార్ధన్ రావు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపిన బిజెపి సీనియర్ నాయకులు కొండిశెట్టి రమణయ్య. శుభాకాంక్షలు తెలిపిన వారిలో షేక్ షంషూర్, బోయళ్ళ నారాయణరెడ్డి, వాయినేని రాఘవ, తదితరులు పాల్గొన్నారు

## రెడ్డి చెరువు ప్రభుత్వ భూమిని దళితులకు ఇవ్వాలని కలెక్టర్ కు వినతి పత్రం



### కాకర్లపల్లి దళితులు

మంథని/పెద్దపల్లి, మే -12,(నేటి శుభోదయ): పెద్దపల్లి కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం జిల్లా కలెక్టర్ ను మంథని మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన దళితులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.మంథని రెవెన్యూ శివారులోని రెడ్డి చెరువు ఆనుకొని ఉన్న 16 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని అర్హులైన నిరుపేద దళితులకు ఇవ్వాలని గతంలో కాకర్లపల్లి దళితులకు భూములు ఇచ్చి సీలింగ్



రికార్డ్లో నమోదు చేశారని ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని అనేక సంవత్సరాలుగా భూములు ఇచ్చి పట్టాలు ఇవ్వాలని తిరుగుతున్నామని అధికారులు కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన నిరుపేద దళితులకు భూములు ఇచ్చి పట్టాలు ఇప్పించడంలో తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కల్లేపల్లి అశోక్ శ్రావణ్ తో పాటు కాకర్లపల్లి దళితులు శంకర్, రవీందర్, సమ్మయ్య, శేఖర్, రాంచందర్,సాగర్,అశోక్, మౌనిక,లక్ష్మి,రాజమ్మ,స్వరూప, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మర్రి హనోక్,పాలిపోగు పోలయ్య భౌతికకాయాలకు నివాళులర్పించి రూ. 50,000/- ఆర్థిక సహాయం చేసిన ఇంచార్జి దద్దాల



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) (కనిగిరి /పామూరు): కనిగిరి మండలం బడుగులేరు పంచాయతీ పట్టాభిరామపురం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు మర్రి పెద్ద పిచ్చయ్య,పాలిపోగు తిమోతి కుమారులు మర్రి హనోక్, పాలిపోగు పోలయ్య శనివారం పొగాకు బోర్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీ కొట్టడం తో బైక్ పై వెళ్తున్న ఇద్దరూ మృతి చెందారు.విషయం తెలుసుకున్న వైయస్ఆర్ సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారు హనోక్, పోలయ్య ల భౌతికకాయాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి ఇరువురి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యంగా ఉండాలని ఓదార్చి ఇద్దరి కుటుంబాలకు చెరో రూ. 25,000/- చొప్పున రూ.50,000/- ఆర్థిక సహాయం చేసి అన్ని విధాలుగా మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు..హనోక్, పోలయ్య పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్ధించినట్లు ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో కనిగిరి



మండల అధ్యక్షులు జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి,ఆవుల భాస్కర్ రెడ్డి,ఎంపీటీసీ పాపనబోయిన కోటమ్మ, పాపనబోయిన నాగేశ్వరావు,సైకం ఏడుకొండలు రెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి,మర్రి స్టీఫెన్,బొజ్జా ఇసాక్,కొమ్మల యోసులు,మర్రి డేవిడ్, పాలిపోగు ఏసుదాసు,పాలిపోగు ఆరోను,మర్రి యోహాను,బలసాని నవయ్య,బొబ్బూరి పోలయ్య,మేకల వెంకటేశ్వర్లు,మోర రామిరెడ్డి,మోర వెంకటేశ్వర్లు,బత్తుల బాల గురువయ్య,రాచకుంట్ల ఆంజనేయులు,రాచకుంట్ల సుబ్బయ్య,రాచకుంట్ల చిన గురవయ్య,కాకర్ల వెంకటేశ్వర్లు,మర్రిబోయిన తిమ్మయ్య ఈర్ల శ్రీను, కంటూ కేశవ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## మేఘవత్ పకీరా రైతుకి కాంగ్రెస్ నాయకులు దండేటికర్ మహేందర్ఆర్థిక సహాయం



ఇబ్రహీంపట్నం మే 12 (నేటి శుభోదయ): మంచాల మండలం పరిధిలో లోయపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంతో నష్టపోయిన రైతుకి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రేష్ రంగారెడ్డి ఆదేశాలతో సీనియర్ కాంగ్రెస్ నేత, విద్యావేత్త శ్రీ దండు మహేందర్, దండేటీకర్ మహేందర్ ఆర్థిక సహాయం చేశారు. ఈ రోజు ఉదయం తెల్లవారుజామున, గుర్తుతెలియని వ్యక్తులు పకీరా నాయక్ అనే రైతు సుమారు యాభై వేల విలువైన గడ్డి వామును తగలబెట్టారు. ఈ సంఘటన తర్వాత, శ్రీ దండెటికర్ మహేందర్జీ రైతుకి తక్షణ సహాయంగా ఐదు వెల రూపాయలు అందజేశారు. ఇతర నేతలు రైతు కుటుంబాన్ని కలిసి వారికి మనోబలం కలిగించారు. ఈ సంఘటనపై మాట్లాడుతూ, శ్రీ దండు మహేందర్ ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. "రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని ఆయన పేర్కొన్నారు.స్థానిక కాంగ్రెస్ నేతలు ఈ సంఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ జంగయ్య గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీ శివశంకర్ గౌడ్, సత్యనారాయణ, దండేటికర్ రామచంద్రం, గణేష్ నాయక్, లక్కు నాయక్, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

## శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి -గంగాదేవి కళ్యాణోత్సవ కార్యక్రమానికి మర్రి నిరంజన్ రెడ్డి గారికి ఆహ్వానం ...



ఇబ్రహీంపట్నం మే 12 (నేటి శుభోదయ): ఈనెల 29 నుండి వచ్చేనెల ఒకటి వరకు జరిగే పెద్దమ్మతల్లి కళ్యాణోత్సవానికి రావాలని పిసిసి సభ్యులు ఆదిభట్ల మాజీ మున్సిపల్ చైర్మన్ రెడ్డి కి ఆహ్వాన పత్రిక అందించిన గ్రామ పెద్దలు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించే పెద్దమ్మతల్లి మరియు గంగాదేవి అమ్మవార్ల కళ్యాణోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి సభ్యులు - ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి గారిని ఆహ్వానించిన మంచాల ముదిరాజ్ సంఘం - ఆలయ కమిటీ సభ్యులు, ఈ కార్యక్రమంలో మంచాల మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎద్మ నరేందర్ రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ రావుల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పందుగుల లింగం గౌడ్, రాములు, కగు అశోక్, కృష్ణ, యాదయ్య, నర్సింహా, బిక్షపతి, బుగ్గరాములు, గణేష్ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## నిల్యా నాయక్ మృతి తీవ్రంగా కలిచివేసింది



### బీఆర్ఎస్ నాయకులు వై. రవీందర్ యాదవ్

కేశంపేట ప్రతినిధి (నేటి శుభోదయ): కేశంపేట మండలం కాకునూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, మలిదశ ఉద్యమకారుడు వద్యవత్ నిల్యా నాయక్ మృతి తీవ్రంగా కలిచివేసిందని బీఆర్ఎస్ యువనాయకులు వై. రవీందర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న రాత్రి జరిగిన ప్రమాదంలో నిల్యా నాయక్ మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువనాయకులు వై. రవీందర్ యాదవ్ గారు వారి స్వగృహానికి వెళ్లి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ సర్పంచులు శ్రీశైలం గౌడ్, వెంకట్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, నాయకులు రమేష్ గౌడ్, కోటేశ్వర్, జమాల్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



## శ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు

### కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు



ఇబ్రహీంపట్నం మే 12 (నేటి శుభోదయ): ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగర కలాన్ మరియు ఇబ్రహీంపట్నంలో శ్రీ శ్రీ లక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న గౌరవ ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి దైవజంతులకు సంబంధించిన వేరే ఒకటి ఏది లేదు దైవచింతన్నే ముఖ్యంగా భావించాలని అన్నారు కొంగరకలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు కొంగరకలాన్ గ్రామంలో ఉన్న ప్రజలందరూ కూడా సుఖశాంతులతో ఉండాలని మల్రెడ్డి రంగారెడ్డి గ్రామంలో ఉన్న ప్రజలందరికీ లక్ష్మి నరసింహ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు

## రామాలయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా కలెక్టర్ ను కోరిన ఆలయ కమిటీ సభ్యులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:(నేటి శుభోదయ): నందిపేట్ లో నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న శ్రీ రామాలయం కార్యక్రమానికి రావాల్సిందిగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మరియు అదనపు కలెక్టర్ లను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. రమణ రెడ్డి, మచ్చర్ల సగర్, మంద సాయన్న, నారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అమ్మ దయా ఉంటే అన్ని ఉన్నట్లే.... వినయ్ రెడ్డి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:(నేటి శుభోదయ): ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ప్రతి సారి లాగే ఈ సారి కూడా 19 వ సారి షోలపూర్ లోని రూప భవాని అమ్మవారి ఆలయం నుండి తుల్జాపూర్ లోని తుల్జా భవాని అమ్మ వారి ఆలయానికి 41 కిలోమీటర్ ల పాదయాత్ర చేస్తున్నారు .

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మంత్రి ఫలితాలు అందిస్తుంది ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్



శంషాబాద్ ప్రతినిధి.మే12(నేటి శుభోదయ): వ్యవసాయ రంగంపై రైతులకు పరిపూర్ణ పరిజ్ఞానం కలిగించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కు చెందిన శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరిట ఈనెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వారి వేసే పంటల పట్ల అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నారు అందులో భాగంగానే సోమవారం పెద్ద గోల్కొండ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ గ్రామ మాజీ సర్పంచ్ రైతులు శాస్త్రవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. రాబోయే కరిప్ సీజన్ కోసం రాష్ట్ర రైతంగాన్ని సన్నద్ధం చేయడంలో భాగంగా ప్రొపెసర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె సెవెన్ చంద్ర మాట్లాడుతూ... వ్యవసాయం నిర్వహించే రైతులకు శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తోడైతే రైతాంగంలో సత్ఫలితాలను రైతులు సాధించగలరని అన్నారు. భూసార పరీక్ష, సాగునీటి పరీక్షలు వ్యవసాయానికి జీవనల ద్వారా అయినా ఎరువులు, మందులు, వాడే విధానాలను రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె లక్ష్మయ్య ఫ్యాక్స్ డైరెక్టర్ ఏ దేవేందర్ గౌడ్ , అభ్యుదయ రైతులు భాస్కర్ గౌడ్ బోరు రెడ్డి పాండురంగారెడ్డి నరసింహారెడ్డి ఏ ఈ ఓ రాఘవేంద్ర వ్యవసాయ కళాశాల పరిశోధన విద్యార్థి వి వర్షిత గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయ కుమార్:(నేటి శుభోదయ): నిజామాబాద్ కొత్త బైపాస్, కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో సోమవారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్ఐ మరియు పోలీస్ సిబ్బంది ద్విచక్ర, త్రిచక్ర, భారీవాహనాల డ్రైవర్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు ఆటో డ్రైవర్లు పట్టుబడ్డారు. మద్యం సేవించి ప్రయాణికులను తీసుకెళ్లడం చాలా ప్రమాదకరమని తెలిసినప్పటికీ, నిర్లక్ష్యంగా ప్రవర్తించిన వారిపై కేసులు నమోదు చేశారు.

## ఘనంగా బిజెపి నాయకుడు జొన్నాడ యాదయ్య జన్మదిన వేడుకలు



చేవేళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మే 12(నేటి శుభోదయ): మొయినాబాద్ మండల మున్సిపాలిటీ పరిధిలోని సోమవారం చిలుకూరు గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు జొన్నాడ యాదయ్య జన్మదినం సందర్భంగా హిమాయత్ నగర్ చౌరస్తాలో ఆయన జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అందరూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం శాలువా బొకేతో సన్మానించారు అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు వారు మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ ఆశీస్సులు మీపై ఎల్లప్పుడూ ఉండాలని అన్ని రంగాలలో అంచలంచల గా ఎదగాలని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో హిమాయత్ నగర్ మాజీ ఉపసర్పంచ్ శ్యామ్ రావు, బీఆర్ఎస్ హిమాయత్ నగర్ విలేజ్ అధ్యక్షుడు రాజుగౌడ్, తోల్ కట్ట బిజెపి నాయకుడు నాయకులు రామచంద్ర ముదిరాజ్ ,బిజెపి సీనియర్ నాయకులు తూర్పు సత్యనారాయణ రెడ్డి పాత్రికేయుడు రాంపల్లి సంతోష్ కుమార్ చారి, బీఆర్ఎస్ నాయకులు విలేజ్ వైస్ ప్రెసిడెంట్ ఉరడి నరసింహా ముదిరాజ్ ,జమల్ పూరి రాజేందర్, మహమ్మద్ హైమద్ పాషా, జన్మదిన వేడుకలో తదితరులు పాల్గొన్నారు

## వీర జవాన్ మురళి నాయక్, సచిన్ యాదవ్ రావు వానంజేకి క్యాండిల్ నివాళులు



ఆమనగల్లు(నేటి శుభోదయ): అఖిలపక్ష పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వాహకులు నరేందర్ రాథోడ్,రవి రాథోడ్,రమేష్ నాయక్ బిజెపి,బిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు ఆమనగల్లు మున్సిపాలిటీ పట్టణంలోని అటల్ బిహారీ వాజ్ పేయి చౌరస్తాలో మన దేశ రక్షణ కోసం,సరిహద్దుల భద్రత కోసం తన ప్రాణాలను అర్పించిన వీర జవాన్లు మురళీ నాయక్,సచిన్ వానంజేలకు నివాళులు అర్పించడం జరిగింది.వారి ఆత్మ శాంతి చేకూరాలని 2 నిమిషాలు మౌనం పాటించడం జరిగింది.మురళీ నాయక్ జమ్మూ కాశ్మీర్లో శత్రువులతో పోరాడి వీరమరణం పొందిన మన తెలుగు గడ్డపై జన్మించిన గొప్ప సైనికుడు.ఆయన ధైర్యం,త్యాగం మనందరికీ స్ఫూర్తిదాయకం.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఆమనగల్లు మాజీ మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్,బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు డాక్టర్ పత్యా నాయక్,కల్వకుర్తి అసెంబ్లీ కో కన్వీనర్ గోరటి నరసింహ,ఆమనగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్,ఝాన్సీ శేఖర్ కృష్ణ యాదవ్,రానుంతల సర్పంచ్ సోనా శీను,ఎంపీటీసీ సరిత పంతు,మేడిగడ్డ మాజీ సర్పంచ్ అమర్ సింగ్, డా. చందు నాయక్,సామాజిక కార్యకర్త పాపిశెట్టి రాము,ఎర్రవోలు మహేష్,రమేష్ నాయక్,పద్య నాయక్,సీతారాం నాయక్,నరేష్ బాలు నాయక్, జైరాం నాయక్,శ్రీను నాయక్ ఈశ్వర్,భరత్,లండం మల్లేష్,గణేష్,పంతు నాయక్,అభిమానులు పాల్గొని అమరవీరులని స్మరించుకున్నారు.

## ప్రజా ప్రతినిధులకు బస్తీల సమస్యలపై చిన్న చూపు ఎందుకు ఎస్ వెంకటేష్ కురుమ



రాజేంద్రనగర్ ప్రతినిధి.మే12(నేటి శుభోదయ): ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు మహిళాదేవ్ పల్లి డివిజన్ సమస్యలపై అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారని మైలార్ దేవ్ పల్లి డివిజన్ భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ కురుమ ఆరోపించారు. సోమవారం స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి యువ నాయకుడు రాజేంద్రనగర్ నియోజకవర్గం బి అర్ ఎస్ పార్టీ ఇన్ చార్జ్ పి కార్తిక్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ అధ్యక్షతన మైలర్ దేవ్ పల్లి మెయిన్ విలేజ్ లో పర్యటించడం జరిగింది. ఉమ్మడి హనుమాన్ దేవాలయం వీధిలోఎక్కడ చూసినా శివరెజ్ మేనల్లు పొంగి మురికి నీరు రోడ్లపై ఏరులై పారుతుందని ఆరోపించారు.జలమండలి అధికారులు చూసి చూడనట్టు గాలికి వదిలేసారు అన్నారు.కనీసం ఎండలు మండిపోతున్న తరుణంలో గొట్టపు బావులు ఎండిపోయి మంచినీళ్లు రాక అలమటిస్తున్న ప్రజలకు కనీసం ట్యాంకర్ల ద్వారా మంచి నిరు అందించాలన్న ఆలోచన రావడం లేదా అని ఆయన ప్రశ్నించారు. మంచినీరు లేవు మర్రో అని మొరపెట్టుకుని ఫోన్ చేసి సార్ మాకు వారం రోజుల నుండి మంచినీళ్లు రావడం లేదు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయండి అని ఫోన్ ద్వారా జలమండలి అధికారులకు చెప్పిన వినిపించుకొని అధికారులు ఓట్లు వేసిన ప్రజలు ఇంత ఇబ్బంది పడుతునకూత వేటు దూరంలోనే నాలుగుసార్లు గెలిచిన ఎమ్మెల్యే అదేవిధంగా రెండుసార్లు కార్పొరేటర్ గెలుపొంది అక్కడే నివసిస్తున్న నాయకులు మాత్రం పట్టించుకోని దాఖలు లేవు రెక్క ఆడితేగాని డొక్కా ఆడని నిరుపేదలు ఎక్కువగా నివసించే మై లార్ దేవ్ పల్లి డివిజన్ ని ఇప్పటికైనా పట్టించుకోని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని బిఆర్ఎస్ పార్టీ తరపున కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎన్ రాము యాదవ్ యువత అధ్యక్షులు అక్యం రఘు మై సి రెడ్డి రాజేష్ యాదవ్ అరుణ్ ముదిరాజ్, మంచర్ల చిరంజీవి, కొంపల్లి జగదీష్, రాజు, ఆప్కో రాజు, భగవాన్ దాస్, రాజు, ప్రవీణ్, వెంకటరమణ, అశోక్ కుమార్, సందీప్, భాస్కర్, సునీల్, సరికొండ దుర్గేష్, భూదేవి, సరిత, అరుణారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పశ్య కన్నమ్మ కు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా సమితి ఘననివాళులు



ఖమ్మం,(నేటి శుభోదయ): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, సిపిఐ సీనియర్ నాయకురాలు అమరజీవి పశ్య కన్నమ్మ కు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా సమితి నివాళులు అర్పించారు. కన్నమ్మ ఉద్యమ స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శంగా ఉంటాయని రైతు సంఘం పేర్కొన్నది. నివాళులర్పించిన వారిలో ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు నల్లమోతు నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు విశ్వేశ్వరరావు, మహబూబాబాద్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మోహన్ రెడ్డి, మీడియా మిత్రులు ఏనుగు వెంకటేశ్వరరావు, మాధవరావు యెగినాటి , కన్నమ్మ కూతురు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



పులిచెర్ల, మే 12,(నేటి శుభోదయ) :పులిచెర్ల మండలం దిగువపోకలవారి పల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో నూతనంగా వీధిలైట్లు ఏర్పాటు చేయడం.. మరమ్మత్తులు చేయడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాలలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని, గ్రామాలలో ఎక్కడైనా తాగునీటి సమస్య, వీధిలైట్లు సమస్య ఎదురైతే తమ దృష్టికి వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అందరి సహకారంతో పంచాయతీని అభివృద్ధి కి కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు.

# పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి....

### సిఐటియు జిల్లా నాయకులు రుద్రకుమార్ అల్లి దేవేందర్



చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మే 12 **(నేటి శుభోదయ):** మొయినాబాద్ మండల పరిధిలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో సిఐటియు ఆధ్వర్యంలో నాన్ టీచింగ్ స్టాఫ్ కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రోడ్ ట్రాన్స్పోర్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాజాల రుద్రకుమార్ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం డ్రైవర్లు క్లీనర్స్ ఆయమల వేతనాలు చెల్లించకుండా ప్రవేట్ ఇంటర్నేషనల్ స్కూల్ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ జీవో.నెంబర్ 25 ప్రకారం వారికి వేతనాలు చెల్లించకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని అన్నారు ప్రైవేట్ ఇంటర్నేషనల్ స్కూల్స్ జీవోల ప్రకారం వేతనాలు చెల్లించడం లేదు కార్మికులకు ఐడెంటి కార్డులు నెలాంతర సెలవులు, క్యాజువల్ లీవ్స్ అమలు చేయడం లేదు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పల్లవి స్కూల్ యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకుంటుందని అన్నారు వెంటనే కార్మిక శాఖ అధికారులు స్పందించి పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ను విజిట్ చేయాలని కార్మికుల సమస్యలను తెలుసుకొని కార్మికులకు వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో లిసిఐటియు మోయినాబాద్ మండల ఉపాధ్యక్షులు ముంజగల ప్రభుదాస్ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ అందాల తారల పోటీలు కమ్యూనిస్టులు నాయకులు అక్రమ అరెస్టులు

### సిపిఎం పార్టీ నాయకులను కార్యకర్తలను అరెస్టులతో ఆపలేరు

### రంగారెడ్డి జిల్లా సిపిఐఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు




ఇబ్రహీంపట్నం మే 12 ( నేటి శుభోదయ): ప్రపంచ అందాల తారల పోటీలు హైదరాబాదులో జరుగుతున్న సందర్భంగా ఈరోజు నాగార్జున సాగర్ వెళ్లుతున్నారని వాళ్లని అడ్డుకుంటామని భయంతో మంచాల పోలీసు స్టేషన్ పోలీసులు సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు గోరెంకల నర్సింహ్మా గార్లను ఇండ్ల వద్ద అక్రమంగా అరెస్టు చేసి మంచాల పోలీసు స్టేషన్ లో నిర్బంధించారు. ఇబ్రహీంపట్నం మండలంలో కెవిపిఎస్ నాయకులు సామేలు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి బొగ్గ రాములు అదేవిధంగా యాచారం మండలంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహని సిఐటియు జిల్లా నాయకులు బ్రహ్మయ్య మండల కార్యవర్గ సభ్యులు ఆలంపల్లి జంగయ్య ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పలు మండలాల్లో అందాల తారలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అక్రమ అరెస్టులను వెంటనే విరమించుకోవాలని లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ పైన పోరాటం చేపడుతామని అన్నారు



# జర్నలిస్టుల నివాళి

## అమర జవానుల త్యాగాలకు ఘనంగా శ్రద్ధాంజలి



శంషాబాద్ ప్రతినిధి.మే12(నేటి శుభోదయ): శంషాబాద్ మున్సిపల్ మండలం, జర్నలిస్టులు సరిహద్దుల్లో దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవానులకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) హృదయపూర్వక నివాళులర్పించింది. రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శంషాబాద్ పట్టణ కేంద్రంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమర జవానుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మిద్దెల సత్యనారాయణ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన జవానుల త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మైల. సైదులు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. నేషనల్ కౌన్సిల్ మెంబర్ బి. దేవేందర్ మరియు టిడబ్ల్యూజేఎఫ్ సీనియర్ నాయకులు గణేష్ మాట్లాడుతూ దేశంలో శాంతి స్థాపనకు జర్నలిస్టుల సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. భావి తరాలకు సురక్షితమైన దేశాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు సుదర్శన్, ఎ.గోపాల్, ఇ. బిక్షపతి, ఎం. శ్రీనివాస్, కె. యాదయ్య, పి. నర్సింహ, యాదగిరి, పి. మాధవచారి, రాజు, ఎం. శ్రీనివాస్, ఇ. ప్రభాకర్, కె. ప్రవీణ్, ముత్యాల సుధీర్ కుమార్, కిట్టు ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టులంతా ఒక్కతాటిపై నిలబడి అమర జవానులకు తమ గౌరవాన్ని చాటుకున్నారు.

## కరెంట్ షాక్ తో అగ్నికి ఆహుతైన హార్వెస్టర్ యంత్రం



తలకొండపల్లి**(నేటి శుభోదయ):** వరి కోతలు కోస్తున్న సమయంలో అకస్మాత్తుగా కరెంటు వైర్లకు తాగడంతో హార్వెస్టర్ లో మంటలు చెలరేగి హార్వెస్టర్ యంత్రం పూర్తిగా అగ్నికి ఆహుతైన సంఘటన రంగారెడ్డి జిల్లా జిల్లా తలకొండపల్లి మండలం అంతారం గ్రామంలో జరిగింది...వరి కోతలు కోస్తున్న సమయంలో అకస్మాత్తుగా కరెంటు వైర్లు తాకడంతో హార్వెస్టర్ లో మంటలు చెలరేగి హార్వెస్టర్ యంత్రం పూర్తిగా అగ్నికి ఆహుతైన సంఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం అంతారం లో జరిగింది. వివరాల్లోకి వెళితే వెల్జాల్ గ్రామానికి చెందిన జిల్లాల జనార్ధన్ రెడ్డి కు చెందిన హార్వెస్టర్ అంతారం గ్రామ శివారులో ఓ రైతుకు చెందిన పొలంలో వరి కోతలు కోస్తున్న సమయంలో కరెంటు వైర్లు స్తంభాలు లేకుండా కర్ర సహాయంతో ఉండడంతో వరి ధాన్యం కోస్తున్న హార్వెస్టర్ యంత్రానికి కరెంటు పేర్లు తగిలాయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.అప్రమత్తమైన డ్రైవర్ తప్పించుకో గా హార్వెస్టర్ లో మంటలు అధికమై పూర్తిగా కాలిపోయింది. దీంతో హార్వెస్టర్ యజమానికి భారీగా నష్టం వాటిల్లింది. చుట్టుపక్కల ఉన్న రైతులు అక్కడికి చేరుకుని మంటలార్పారు.

## ఆర్.జి-3 ఏరియా లో పర్యటించిన సి.ఎం.వో



(నేటి శుభోదయ) పెద్దపల్లి జిల్లా ప్రతినిధి :రామగిరి,సెంటినరీ కాలనీ-13: సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ సోమవారం రామగుండం-3 ఏరియాలో పర్యటించారు.చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా రామగుండం-3 ఏరియాలో పర్యటించిన సందర్భంగా జి.యం. కార్యాలయంనందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు వారిని శాలువాతో సత్కరించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వారు స్థానిక డిస్పెన్సరీని సందర్శించి, పరిశీలించారు.ఈ కార్యక్రమంలోడాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ నర్సెస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించిన కేర్ హాస్పిటల్స్

సాధనాల వీరేంద్ర **(నేటి శుభోదయ):** హైదరాబాద్, మే 12, 2025: భారతదేశంలోని ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థలలో ఒకటైన లికేర్ హాస్పిటల్స్, ఇంటర్నేషనల్ నర్సెస్ డేలను పురస్కరించుకొని, తమ నర్సింగ్ సిబ్బంది సేవలకు కృతజ్ఞతగా వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. కార్పొరేట్ కార్యాలయం నుండి ఈ వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. మొత్తం నెట్‌వర్క్ ఆసుపత్రులన్నిటిలో ఒకేసారి ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. కేర్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ - నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ డా. విన్సీ అశోక్ త్రిభువన్ నేతృత్వంలో




హైదరాబాద్ కార్పొరేట్ ఆఫీస్‌లో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి, గ్రూప్ చీఫ్ మెడికల్ సర్వీసెస్ ఆఫీసర్ డా. నిఖిల్ మాథుర్, చీఫ్



హెచ్‌ఆర్ ఆఫీసర్ డా. అమిత్ సింగ్, వెస్ట్ - సెంట్రల్ ఇండియా రీజినల్ సీఈఓ హరీష్ త్రివేది, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ లివినోద్ రామన్‌లితో పాటు, వివిధ ఆసుపత్రుల హెడ్‌లు, డాక్టర్లు పాల్గొన్నారు. ఈ సంవత్సరం నర్సెస్ డే థీమ్ "మా నర్సులు. మా భవిష్యత్తు. కేర్ యొక్క ఆర్థిక శక్తి" అని ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడింది. దీనిని



పురస్కరించుకొని, కేర్ హాస్పిటల్స్ అన్ని యూనిట్లలో ప్రేరణాత్మక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైపుణ్యాల అభివృద్ధి వర్క్‌షాపులు, గౌరవ సభలు, వెల్‌నెస్ యాక్టివిటీలు నిర్వహించారు. ఇవన్నీ నర్సుల సేవల్ని గుర్తించి, వారిని ఉత్సాహపరిచేందుకు చేపట్టారు. సామాజిక బాధ్యతలో భాగంగా, కేర్ హాస్పిటల్స్ వివిధ నగరాలలో అనాథాశ్రమాల్లోని పిల్లల కోసం ఉచిత ఆరోగ్య తనిఖీ శిబిరాలు నిర్వహించింది. ఇందులో పిల్లలకు పీడియాట్రిక్ చెకప్‌లు, పోషకాహార సూచనలు, డాక్టర్ కన్సల్టేషన్‌లను అందించింది. విశాల్



మహేశ్వరి, మాట్లాడుతూ, "నర్సులు ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. కేర్ హాస్పిటల్స్ వారు నర్సింగ్ బృంద అభివృద్ధికి ఎల్లప్పుడూ మద్దతు ఇస్తోంది" అని చెప్పారు. ఈ సందర్భంగా డా. నిఖిల్ మాథుర్ మాట్లాడుతూ, "నర్సులు ఆరోగ్య వ్యవస్థకు బలమైన స్థంభాలు. వారి నైపుణ్యం, మానసిక బలంతో ప్రతి రోజు పేషెంట్లకు నాణ్యమైన సేవ అందిస్తున్నారు. నేటి హెల్త్‌కేర్ రంగం మారుతున్న పరిస్థితుల్లో, నర్సులు నాయకులు, శిక్షకులు, కోఆర్డినేటర్లుగా కూడా




మారుతున్నారు. కేర్ హాస్పిటల్స్‌లో మేము నర్సుల శ్రేయస్సు, అభివృద్ధే భవిష్యత్తు ఆరోగ్య సంరక్షణకు మూలం అని నమ్ముతున్నాం" అని చెప్పారు. డా. అమిత్ సింగ్ మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా




నర్సుల అవసరం పెరుగుతోంది. ఆసుపత్రుల పని తీరుపై పూర్తి అవగాహన ఉన్న నర్సులు నాయకత్వ పాత్రలు తీసుకోవాలి" అని తెలిపారు. డా. విన్సీ అశోక్ త్రిభువన్ మాట్లాడుతూ, "ఇంటర్నేషనల్ నర్సెస్ డే ప్రతి నర్సు చేసే గొప్ప సేవలకు గుర్తింపు ఇచ్చే రోజు. నేటి నర్సులు కేవలం పేషెంట్లను చూసుకోవడం కాకుండా, హాస్పిటల్ పనితీరును మెరుగుపరచడం, బృందాల్ని నడిపించడం, మంచి ఫలితాలను తీసుకురావడంలో ముందుంటున్నారు. వారిని గౌరవించేందుకు ఈ వారంతా జరుపుకున్న వేడుకలు ఒక చిన్న కృతజ్ఞత" అని చెప్పారు. కేర్ గ్రూప్‌లోని ప్రతి ఆసుపత్రి తమ బృందానికి అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. ఇది సిబ్బందిలో ఐక్యతను, అభినందన భావాన్ని పెంపొందించింది.

# అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:**(నేటి శుభోదయ):** అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా నగరం అంత సేవ కార్యక్రమాలతో మారు మొగిపోయింది.బిజెపి పార్టీ నాయకులు,శ్రేయోభిలాషులు,





అభిమానులు,కార్యకర్తలు తమ ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఉండాలని నగరంలో ఆలయాలలో ప్రత్యేక



పూజలు, అన్నదాన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు,పెద్దఎత్తున నిర్వహించడం జరిగింది.

**ప్రత్యేక పూజలు:**

శ్రీవాసవికన్యాకాపరమేశ్వారి ఆలయం,నీలకంఠేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**మహాన్నదాన కార్యక్రమాలు :**

నీలకంఠేశ్వర ఆలయంలో మహా అన్నదానం,దుబ్బ అరుంధతి నగర్ లో అన్నదానం,నాగారం 80 క్వార్టర్స్ లో అన్నదానం, పిఎల్ఎంఎస్ పెట్రోల్ బంక్ దగ్గర అన్నదానం,కొత్త గంజ్ లో అన్నదాన కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది.



**రక్తదాన శిబిరాలు :**

ఆర్యవైశ్య పట్టణ సంఘం, మార్వాడి గల్లీ డిఎస్ఎన్ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాలలో దాదాపు వందమంది రక్తదానం చేసారు. ఖలీల్ వాడిలోని పలు చోట్ల మొక్కలు నాటడం జరిగింది. వర్నీ చౌరస్తాలో మజ్జిక పంపిణి వంటి సేవ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు తన మీద ప్రేమ అభిమానాలతో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సేవ కార్యక్రమాలకు ధన్యవాదాలు తెలిపారు తనను ఆదరించే బిజెపి నాయకులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని తెలిపారు.

# మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలి

### యుద్ధ వాతావరణంలో అందాల పోటీలు నిర్వహించడం తప్పుడు సంకేతం

### ఆపరేషన్ సిందూర్ కు మద్ధతుగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

### ర్యాలీలో పాల్గొన్న జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### పరిపాలన చేతకాని సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి: ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:**(నేటి శుభోదయ):** హైదరాబాద్ రాష్ట్రంలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న ఈ సమయంలో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని, ఐపీఎల్ ను వాయిదా వేసినట్లుగా మిస్ వరల్డ్ పోటీలను కూడా వాయిదా వేయాలని సూచించారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొంటే దేశంలో అందాల పోటీలు పెట్టారన్న అపవాదు తెలంగాణకు వస్తుందని అన్నారు.ఇది విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయమని, తప్పుడు సంకేతాలకు తావుని



వ్వకూడదని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్ కు మద్ధతుగా,భారత సైన్యానికి సంఘీభావంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు జరిగిన భారీ ర్యాలీకి ఎమ్మెల్సీ కవిత నాయకత్వం వహించారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాద స్థావరాలను దిగ్విజయంగా భారత సైన్యం ధ్వంసం చేసిందని ప్రశంసించారు. సైన్యం వల్ల మనకు రక్షణ కలుగుతుందని, కాబట్టి వారికి ధైర్యం,స్థైర్యాన్ని నింపడానికి ర్యాలీ చేశామని చెప్పారు. పాకిస్తాన్ మన దేశంలోని ఎయిర్ పోర్టులను టార్గెట్ చేసుకొని చేసిన దాడులకు భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టిందని తెలిపారు.అన్ని జిల్లాల్లో ఇలాంటి ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. "ఇది ధర్మయుద్ధం.భారత్ ఎప్పుడూ తప్పు చేయదు. నీతి,నిజాయితీతోనే యుద్ధం చేస్తున్నాం.మనం పాకిస్తాన్ భూ భాగంలోని సామాన్య ప్రజలను ఏమి అనలేదు. కేవలం ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేశాము."అని వ్యాఖ్యానించారు. మరోవైపు,విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు ఎమ్మెల్సీ కవిత సమాధానమిస్తూ.... ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం రాకపోతే,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేనప్పుడు పదవి నుంచి తప్పుకోవాలని సూచించారు. పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన, ప్రజలైనా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలనే అమలు చేయాలని అడుగుతున్నారని,కానీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని స్పష్టం చేశారు. అన్నారు.ముఖ్యమంత్రి ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని,రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే విధంగా సీఎం మాట్లాడడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు.

## ప్రజావాణికి 121 ఫిర్యాదులు, సమస్యలను తొందరగా పరిష్కరించాలి.... కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: **(నేటి శుభోదయ):** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 121 ఫిర్యాదులు అందాయి. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి,నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిత్తశుద్ధి,అంకితభావం,కరుణ,సేవ కలగలిపితేనే నర్సు

### గుడివాడ ఎన్జీవో నాయకుడు రాజేంద్ర

### ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో... అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



గుడివాడ, మే 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): అంతర్జాతీయ నర్సుల దినోత్సవ కార్యక్రమాన్ని ఏ.పీ ఎన్జీవోస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గుడివాడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న హాస్పిటల్ హెడ్ నర్స్ రజిని, నిర్మల ఫ్లోరెన్స్ లను ఎన్జీవో అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోగులమూడి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నారు. చిత్తశుద్ధి, అంకితభావం, కరుణ, సేవ కలగలిపితేనే నర్సు అని ఆయన పేర్కొన్నారు.కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలదించిన నర్సింగ్ సిబ్బందిని గౌరవించుకోవడం సంతోషకరమని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఇందిరా దేవి, ఎన్జీవోస్ అసోసియేషన్ సభ్యులు కే.పీ రావు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సేవలను అభినందించిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:**(నేటి శుభోదయ):** రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సేవలందిస్తున్న తోట రాజశేఖర్ కు జాతీయ స్థాయిలో రెడ్ క్రాస్ అవార్డు వచ్చిన సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు రెడ్ క్రాస్ జిల్లా శాఖ ద్వారా చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు, జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న తోట రాజశేఖర్ ను ప్రత్యేకంగా సత్కరించి పూల మొక్కను అందచేశారు.గత అనేక సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం అభినందనీయం అని కొనియాడారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రూపొందించిన వడదెబ్బ నివారణ సూచనా పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు.ప్రజలలో అవగాహన పెంపొందించడంలో రెడ్ క్రాస్ కొనసాగిస్తున్న కృషిని ప్రశంసించారు.ప్రజలకు అత్యవసర సమయాల్లో బ్లడ్ డొనేట్ సేవలు అందిస్తున్నందుకుగాను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్,కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఏ.సి.పి రాజా వెంకట్ రెడ్డి,ఇంచార్జి ఆర్.డి.ఓ స్రవంతి,డి.పి.ఓ శ్రీనివాస్ రావు,డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, టీఎన్జీఓ ల సంఘం అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్,రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, కోశాధికారి కరిపే రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19 నుంచి పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు

**30 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతాయి**

**కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు**




మచిలీపట్నం: మే 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) : మే 19 నుంచి మే 28వ తేదీ వరకు 10వ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు మందిరంలో విద్య, వైద్య, ఏపీఎస్ఆర్టీసీ, పోలీసు, పోస్టల్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరుగుతాయని, ఆయా శాఖలు సమన్వయం చేసుకుంటూ పరీక్షల నిర్వహణకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,544 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. పగడ్బందీ పరీక్షల నిర్వహణ నిమిత్తం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్, కస్టోడియన్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, వాటికి సమీపంలో ఎలాంటి జిరాక్స్ సెంటర్లు తెరవకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా కేంద్రాల వద్ద ముఖ్యమైన ఔషధాలతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్య సిబ్బంది సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా నిరంతరాయ విద్యుత్, ఆయా రూట్లలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మే 19వ తేదీన ప్రథమ భాష, 20న ద్వితీయ భాష, 21న ఆంగ్లం, 22న గణితం, 23న భౌతిక శాస్త్రం, 24న జీవశాస్త్రం, 26న సాంఘిక శాస్త్రం, 27న ప్రథమ భాష పేపర్-2 (కాంపోజిట్ కోర్స్), ఓపెన్ స్కూల్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1, 28న ఓపెన్ స్కూల్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు సమాంతరంగా 14 పరీక్షా కేంద్రాలలో ఓపెన్ స్కూల్ ఎస్ ఎస్ సి, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా జరుగుతాయని, మొత్తంగా 2,307 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

## ఎమ్మెల్యే ధనపాల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన.... న్యాయవాద పరిషత్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:**(నేటి శుభోదయ):** నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధనపాల్ సూర్యనారాయణ జన్మదినం సందర్భంగా వారికి న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ జన హృదయ నేత,ధర్మ పరిరక్షకులు, పేదవారికి అండగా నిలబడేటటువంటి నీతి నిజాయితీ నిబద్ధత కలిగినటువంటి నాయకుడు ధన్పాల్ సూర్యనారాయణ అని వారు భవిష్యత్తులో ఇలాంటి అనేకమైనటువంటి జన్మదినాలు జరుపుకొవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ సీనియర్ నాయకులు రాజకుమార్ సుబేదార్,పిల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గ - రాయలచెరువు రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జేసి అస్మిత్ రెడ్డి



యాడికి మే 12 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ): మండలంలోని నిట్టూరు వద్ద బుగ్గ- రాయలచెరువు వరకు నిర్మించ తలపెట్టిన రోడ్డు పనులకు సోమవారం తాడిపత్రి శాసనసభ్యులు జెసి అష్మిత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులు మాట్లాడుతూ బుగ్గ రాయలచెరువు రోడ్డు నిర్మాణం 4 కోట్ల నాబార్డు నిధులతో నిర్మితమవుతోందన్నారు.ఈ రోడ్డు నిర్మాణం వల్ల రెండు జిల్లాల సరిహద్దు ప్రజలకు ప్రయాణం సులభతరమవుతుంది అన్నారు. పనులు తొందరలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యాడికి టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, రవికుమార్ రెడ్డి, పరిమి చరణ్ , నాగ ముని రెడ్డి,కాంట్రాక్టర్లు, ఆర్ అండ్ బి అధికారులు, టీడీపీ బీజేపీ జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

## గ్రామస్థాయి ప్రజలకు న్యాయ సేవలు అందించాలన్న లక్ష్యమే



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:**(నేటి శుభోదయ):** భారత న్యాయ చట్టాలు అందరికీ తెలియాలని, దేశంలోని అట్టడుగు వర్గాలకు సైతం న్యాయం అందించాలన్న ప్రధాన లక్ష్యంతో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పనిచేస్తుందని సీనియర్ సివిల్ జడ్జ్,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నిజామాబాద్ సెక్రెటరీ జి ఉదయభాస్కర్ రావు అన్నారు. సోమవారం డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గల మోక్షనంత బుద్ధ విహారం ను సందర్శించి,బుద్ధ విహార్ లో జ్యోతి ప్రజ్వల గావించి తిమ్మాపూర్ గ్రామ ప్రజలకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడుతూ డి ఎల్ ఎస్ ఏ ద్వారా గ్రామాలలో ఉన్న సివిల్ తగాదాలను, బ్యాంకు రుణాలు, భార్యాభర్తల మధ్య, అన్నదమ్ముల మధ్య తగాదాలకు రాజీ కుదరచటం,రాజీమార్గమే రాజమార్గం అన్న సిద్ధాంతంతో పలు పరిష్కారం కానీ వ్యాజ్యాలు,రాజీమార్గము ద్వారా సంవత్సరాలుగా న్యాయం కోసం నిరీక్షించే తమ యొక్క కోర్టు కేసులను శాశ్వతంగా పరిష్కరించుకొనటానికి ఓ చక్కని వేదికగా పనిచేస్తుందని లోక్ అదాలత్లలో ఇవ్వబడిన అవార్డులు సుప్రీంకోర్టులో సైతం అప్పిల్కు ఆస్కారం లేనట్లుగా శీఘ్ర న్యాయ తీర్పుతో కక్షిదారులకు సమయము,డబ్బు ఆదా చేయబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోక్షనందా స్వామి మరియు తిమ్మాపూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆఫ్కాబ్ చైర్మన్ పదవి నియామకంపై పునరాలోచన చేయాలి

**నెట్టెం రఘురాం కి సముచిత పదవిని ఇచ్చి గౌరవించాలి**

**42సం.లుగా పార్టీ కోసం పనిచేసిన వ్యక్తికి ఇచ్చే గౌరవం ఇదేనా?**

**రాష్ట్రానికే ఆదర్శం జగ్గయ్య పేట అని చెప్పిన మాటలు మర్చిపోయారా**

**నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరిగితే పార్టీ తీవ్రంగా నష్టపోతుంది**

**జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం ముఖ్యనేతల సమావేశంలో అధిష్టానంపై అసంతృప్తి**

జగ్గయ్యపేట, మే 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ఆఫ్కాఫ్ చైర్మన్ నియామకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు పునరాలోచన చేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి ముఖ్య నేతలు కోరారు. జగ్గయ్యపేట శుభమస్తు కళ్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు కట్టా నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, సిహెచ్ నాగ మల్లేశ్వరరావు, జగ్గయ్యపేట పట్టణ టిడిపి అధ్యక్షులు మేకా వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ గింజుపల్లి రమేష్, తెలుగుదేశం బీసీ సెల్ నాయకుడు తాళ్లూరి వెంకటే శ్వర్లు, మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ అన్వర్ తదితరులు మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు నెట్టెం రఘురాంకు కేడిసిసి బ్యాంక్ చైర్మన్ పదవి ఇచ్చిప్పుడు ఆప్కాబ్ చైర్మన్ గా నియమిస్తా మని అధిష్టానం హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఎప్పుడు మరొకరికి అవకాశం ఇవ్వడంపై వారు తీవ్ర నిరసన తెలిపారు. 42 సం.రాలు గా తెలుగుదేశం పార్టీయే శ్వాసగా, పార్టీ అభివృద్ధి జీవిత లక్ష్యంగా చేసుకొని పనిచేశారని, 1995 లో పార్టీ సంక్షోభ సమయంలో ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి అండగా నిలిచి, వెన్నుదన్నుగా నిలబడి ముఖ్య మంత్రి కావటంలో కీలక పాత్ర పోషించా రని చెప్పారు. జగ్గయ్యపేట నియోజక వర్గంలో పార్టీ కి గట్టి పునాదులు వేశా రని, పార్టీకి ఇబ్బందులు ఎదురైనప్పుడు తాను స్వయంగా తప్పుకొని పార్టీ నిలబెట్టడానికి తన పదవిని త్యాగం చేశారని, తిరిగి విజయవాడ పార్ల మెంటు టిడిపి అధ్యక్ష పదవిని ఇచ్చినప్పుడు సవాలుగా తీసుకొని పార్టీని నిర్వహించారని, గత ఎన్నిక ల్లో అన్ని అసెంబ్లీ పార్లమెంటు స్థానాలను పార్టీకి కట్టబెట్టడంలో కీలకంగా వ్యవహరించారని, ఇతటి ఘన చరిత్ర కలిగిన రఘురాం కు పదవులు ఇవ్వటంలో అనర్హత ఏమిటో అంతుబట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సందర్భాల్లో పార్టీ వేదికలలో పార్టీ కోసం జగ్గయ్యపేట నియోజకవర్గం లో, ఎన్టీఆర్ జిల్లాలో పార్టీని నిర్వహిస్తున్న తీరును ఆదర్శంగా తీసుకోవాలని చెప్పిన విషయాలను మరిచిపోయారా అని వారు ప్రశ్నించారు. నెట్టెం రఘురాంకు సముచితమైన పదవిని వచ్చి గౌరవించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పదవులకు వదులుకు నేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సమావేశంలో పార్టీ నాయకులు మన్నే కళావతి, రావూరి శ్రీనివాసరావు, నలజాల రామకృష్ణ, రావిరాల రాజు, తాటి రామారావు, కుంచపర్తి నాగేశ్వర రావు, అన్నెపాగ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15 నుంచి ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ?

**ఆంధ్రప్రదేశ్ కూటమి సర్కార్ కీలక నిర్ణయం**

**ఉపాధ్యా యులబదిలీలకు సంబంధించిన ప్రక్రియపై ఫోకస్**

విజయవాడ, మే 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ): ఈనెల 15 నుంచి ఆన్ లైన్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేపట్టింది. సర్వీసుకు ప్రామాణిక తేదీగా మే31 గా నిర్ణయం తీసుకుంది. మే31 నాటికి ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, అయిదేళ్ల సర్వీసు పూర్తయిన హెచ్ఎంలకు తప్పనిసరిగా బదిలీలు ఉంటాయని, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

## తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ పరీక్షల తాజా షెడ్యూలు విడుదల

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:**(నేటి శుభోదయ):** తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ రెగ్యులర్ రెండవ,నాలుగవ,ఆరవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ (2020 నుండి 2024 బ్యాచ్ ల కు) ఒకటవ,మూడవ,ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14 నుండి ప్రారంభమవుతాయని గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే.అయినప్పటికీ అనివార్య కారణాల వలన ఈ పరీక్షలు14వ తేదీకి బదులుగా ఈ నెల16వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని,తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు24,500 విద్యార్థులు 32 సెంటర్లలో హాజరవుతారని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య.కే.సంపత్ కుమార్ తెలిపారు.పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని కంట్రోలర్ తెలిపారు.

## శ్రీవాణి దర్శన టికెట్లపై దుష్ప్రచారం సరికాదు

**తిరుమల తిరుపతి దేవస్థానం**

తిరుమల, మే 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) : శ్రీవాణి దర్శన టికెట్లపై దుష్ప్రచారం సరికాదుః టీటీడీ తిరుమలలో ఆఫ్లైన్ లో ఇస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల మిగిలిపోయాయంటూ సోషియల్ మీడియాలో కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని టీటీడీ పేర్కొంది. వాస్తవానికి ఆన్ లైన్లో 500 టికెట్లు, తిరుపతి ఎయిర్ పోర్ట్ లో 200 టికెట్లను అందుబాటులో ఉంచగా ఎప్పటికప్పుడు భక్తులు బుక్ చేసేసుకుంటున్నారు. ఏరోజు కూడా ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్లు మిగిలిన సందర్భం లేదు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు 800 టికెట్లను భక్తులకు ఆఫ్ లైన్ లో జారీ చేస్తున్నారు. గత కొన్ని రోజుల్లో ఆఫ్ లైన్ లో పదుల సంఖ్యలో తగ్గాయేకాని, కొందరు వ్యక్తులు సోషియల్ మీడియాలో గతవారం రోజుల్లో వందల సంఖ్యలో టికెట్లు మిగిలిపోయినట్లు ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవం. అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం తగదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## విధులు పట్ల ఆసక్తి చూపించాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి కళావతి బాయి**




ఖమ్మం, **(నేటి శుభోదయ):** విధులు పట్ల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అసక్తి చూపించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి కళావతి బాయి పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, పి. పి. యూనిట్స్, ఏరియా హాస్పటల్స్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖా సెంట్రల్ స్టోర్స్ ఫార్మసి ఆఫీసర్లకు సోమవారం ఫస్ట్ ఫ్లోర్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఒకరోజు రీ ఓరియంటేషన్ కం శిక్షణ కార్యక్రమం నిర్వహించగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం




తెలంగాణ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఫార్మసీ ఆఫీసర్లు ఆన్లైన్ ఎఫ్.పి-ఎల్.ఎం.ఐ.ఎస్. పోర్టల్ ద్వారా కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులలో వాడుతున్న కమోడిటీస్ - ఐ.యు.డి.లు, ఓరల్ పిల్స్ (నోటి మాత్రలు), కండోమ్‌లు, అంతరా ఇంజెక్షన్ల స్టాక్ తప్పనిసరిగా చూపెట్టాలి. అవసరం మేరకు స్టాక్ ను అందుబాటులో ఉంచాలి. స్టాక్ స్వీకరించి లబ్ది దారులకు అవగాహన కల్పించి ఉపయోగించాలని ఈ విషయంలో అర్హులైన దంపతులకు ఫ్యామిలీ ప్లానింగ్ తాత్కాలిక పద్ధతులపై అవగాహన కల్పించి వారి సుఖమయ జీవితానికి సరైన సేవలు ఉచితంగా అందించి వారి ఆరోగ్యంతో పాటు వారి పిల్లల ఆరోగ్యాన్ని కూడా రక్షిస్తూ పిల్లకు పిల్లకు మధ్య ఎడం పాటించేలా చేసి మంచి ఫలితాలను రాబట్టాలని తెలిపారు. వీటితో పాటు అన్ని సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను ఖచ్చితంగా నిర్వహించాలని, ఆన్లైన్ ఎఫ్. పి - . ఎల్.ఎం.ఐ.ఎస్ పోర్టల్లోని డేటాతో ధృవీకరించబడేలా సరిచూసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. బి. కళావతి బాయి తెలిపారు . కార్యక్రమంలో స్టాటస్టికల్ ఆఫీసర్ నవీన్, డెమో సుబ్రహ్మణ్యం, ఫార్మసి సీనియర్ ఆఫీసర్, ఫార్మసి ఆఫీసర్లు పాల్గొన్నారు.

## నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:**(నేటి శుభోదయ):** ఆర్మూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ రథసారథి పొద్దుటూరి వినయన్న ఆదేశాల మేరకు మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ ఆధ్వర్యంలో ఈ రోజు నందిపేట్ పట్టణం లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పేదలను ఎంపిక చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ సంక్షేమ పథకాలు అర్హులకు అమలు అయ్యేలా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అర్హులైన వారికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు లిస్ట్ తయారు చేసి మండల అధికారులకు అందజేయాలని కోరారు.నందిపేట్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రభుత్వం అందించే ప్రతి పథకం అర్హులకు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో దమ్మాయి శ్రీను,ఇసుబ్,జమీల్,తమ్మల్లా గంగాధర్,ఎర్రం లింగం,ప్రభుదాస్,కాంతం చిన్నయ్య,తిమ్ముల పోశెట్టి,నడ్కుడా భూమన్న,మన్నూర్ భూమేష్,ఎర్రం పోశెట్టి,కదిర్,అఫ్జల్,మన్నె సాగర్,బర్కి నర్సయ్య,ఫిరోజ్,ఎడ్డిగారి నిఖిల్,పీరాజీ నాగరాజు,సందీప్,మగ్గిడి శ్రీను,బల్గం దశరత్,మేర శ్రీను,కజవాలి,తమ్మల్లా దేవేందర్,గద్దె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ధిక పరిస్థితి బాగా లేకపోయినా పేదలకు ఆర్ధిక తోడ్పాటు అందిస్తున్నాం

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**కూసుమంచి మండల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన మంత్రి**




ఖమ్మం, కూసుమంచి,**(నేటి శుభోదయ):** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ, వాటిని సరిచేసుకుంటూ పేదలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి




శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, కూసుమంచిలోని పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. చెక్కుల పంపిణీ




అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ఖజానాలో సరిపడా నిధులు లేకపోయినా అనేక ఇబ్బందులు పడుతూనే ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, భవిష్యత్తులోనూ అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, కూసుమంచి మండల ఇంఛార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ

**తహశీల్దార్లు పున్నంచందర్, రాంబాబు లు**

**భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం**

**బోనకల్ మండలం లక్ష్మీపురం, రాయన్నపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్లు**



ఖమ్మం, బోనకల్,**(నేటి శుభోదయ):** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు ఏ. పున్నం చందర్, ఆర్. రాంబాబు లు అన్నారు. సోమవారం బోనకల్ మండలం లక్ష్మీపురం, రాయన్నపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్లు



మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం



అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు . హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 89, రాయన్నపేట గ్రామ రెవెన్యూ సదస్సులో 100 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల ఆర్ఐలు నవీన్, మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను సందర్శించిన డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు



( నేటి శుభోదయ)పెద్దపల్లి జిల్లా ప్రతినిధి రామగిరి సెంటినరీ కాలనీ -13: స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో శిక్షణ తరగతులను త్వరలో ప్రారంభించే ఏర్పాట్లు చేయాలని డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్, మరియు పర్సనల్ శ్రీ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు.రామగుండం-3 ఏరియాలోని స్థానిక ఎం.వి.టి.సి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను సందర్శించి, పరిశీలించారు.వారికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ పనుల వివరాలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు వివరించారు.డైరెక్టర్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ పనులను త్వరత గతిన పూర్తి చేసి, శిక్షణ తరగతులను ప్రారంభించే విధంగా తగు చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఓటుజిఎం బి.వి. సత్యనారాయణ, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగధిపతి బి.సుదర్శనం, వీటీసీ మేనేజర్ సుజిత్ తోపాటు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎల్ లో ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు

ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘము గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కర్క నాగ రాజు




చేవేళ్ల నియోజకవర్గం మే 12 (నేటి శుభోదయ): హెచ్ఎల్ లో బుద్ధ పూర్ణిమ ను పురస్కరించుకొని సోమవారం నాడు హెచ్ ఎల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమానికి హేచ్ ఎల్ డీజీమ్ హెచ్.ఆర్ సూర్యకుమార్ రౌత్ విచ్చేసి బుద్ధుడికి పూలతో నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు బోదించిన సూక్తులు ప్రపంచంలో అందరు పాటిస్తున్నారు అని శాంతి ని నెల కొల్పడంలో ఆయనను మించినవారు లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో హెచ్ఆర్ సియం ఐఆర్ ప్రహలాద్,సీనియర్ మేనేజర్ సత్యనారాయణ, రికగ్నిసెడ్ రికగ్నైస్డ్ యూనియన్ అధ్యక్షులు వేంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, అసోసియేషన్ అధ్యక్షులు పట్టు రమేష్ కుమార్, ప్రధానకార్యదర్శి శశికుమార్,ఏస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చూడమన్,రవికుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ బాబు,నాగార్జున,విజయశ్రీ, పద్మ,లక్ష్మణ్, తిమ్మయ్య, విష్ణు,ప్రేమ్,మురళి, రామకృష్ణ, శ్రీధర్,రమేష్,జోగారావు, ప్రవీణ్, రాంబాబు, బిలియా,తదితరులు పాల్గొన్నారు

## డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మం, **(నేటి శుభోదయ):** ఒరిస్సా లోని బర్గర్లో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లమా కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు తెలంగాణ రాష్ట్రంలోని అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హనుమకొండ జిల్లా చేనేత, జౌలీ శాఖ సహాయ సంచాలకులు ఎం విజయలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. ఈ కోర్సుల్లో చేరేందుకు తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు 9 సీట్లు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కోర్సులో శిక్షణ పొందగోరే అభ్యర్థులు లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. వయస్సు 16/7/2025 తేదీ నాటికి బిసి, జనరల్ కేటగిరీలకు 15 నుండి 23 సంవత్సరాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వారికి 25 సంవత్సరముల వయసు అనుమతించబడుతుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా నుండి 2025-26 విద్యా సంవత్సరానికి గాను మూడు సంవత్సరముల డిప్లమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సు చదువుటకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, %ఱఱ.ఱఅష్ట్రమ్ఱతీస్త్రుతీష్ట్ర.శీతీస్త్ర.ఱఅ% వెబ్సైట్ ద్వారా పొందే అప్లికేషన్లతో నేరుగా 10-6 - 2025 తేదీలోపు ప్రిన్సిపాల్, శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, వెంకటగిరి, నెల్లూరు జిల్లా వారిని సంప్రదించవలసినదిగా కోరారు. దరఖాస్తులను సేకరించేందుకు ఆఖరు తేదీ 10-06-2025 తేదీగా నిర్ణయించినట్లు విజయలక్ష్మి ఆ ప్రకటనలు తెలిపారు.

## శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం.

మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్



మైలవరం, మే 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్అన్నారు.



సోమవారం వసంత సమ్మర్ కబడ్డీ పోటీలను విజయవాడ ఎం. పి. కేశినేని శివనాథ్ తో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ప్రతిభ క్రీడాకారులకు తమ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా క్రీడల నిర్వహణకు పెద్దపీట వేస్తోందన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధిలో భాగంగా సీఎం చంద్రబాబు మన మైలవరం నియోజకవర్గంలో స్పోర్ట్స్ సిటీ, యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. స్పోర్ట్స్ హబ్ గా మైలవరం నియోజకవర్గం విరాజిల్లుతుందన్నారు. ఏసీఏ అధ్యక్షునిగా సేవలందిస్తున్న ఎంపీ చిన్ని మన ప్రాంత అభివృద్ధిపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి శ్రీ అక్కల రామ్మోహనరావు (గాంధీ) గారు, ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 90 రోజుల పాటు కొత్త సుంకాలు: అమెరికా, చైనా మధ్య డీల్



**న్యూఢిల్లీ,:** నువ్వా నేనా అంటూ ప్రతీకార సుంకాలను అంతకంతకూ పెంచుకుంటూ పోయిన అమెరికా, చైనా దేశాలు టారిఫ్‌ల విషయంలో ఓ డీల్ కుదుర్చుకున్నాయి. తాజా ఒప్పందం ప్రకారం.. అమెరికా దిగుమతులపైన చైనా విధించిన 125 శాతం సుంకాలలో 10 శాతం తగ్గించింది. అదే సమయంలో అమెరికా కూడా చైనా దిగుమతుల మీద విధించిన 145 శాతం సుంకాలలో 30 శాతం తగ్గించించింది. ఇరు దేశాలు (చైనా, అమెరికా) కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. ఈ సుంకాల తగ్గింపు 90 రోజులు మాత్రమే అమలులో ఉంటాయని తెలుస్తోంది. కొత్త సుంకాలు మే 14 నుంచి అమలులోకి రానున్నాయి. ఆ తరువాత తగ్గింపు సుంకాలే కొనసాగుతాయా?, ముందుకు విధించిన సుంకాలు కొనసాగుతాయా?, అనే విషయం తెలియాల్సి ఉంది. అమెరికా ప్రపంచ దేశాల మీద ప్రతీకార సుంకాలను విధించిన సమయంలో.. చైనా కూడా అమెరికాకు ధీటుగా సుంకాలను పెంచింది. దీంతో వాణిజ్య యుద్ధం మొదలైంది. ఈ ప్రభావం స్టాక్ మార్కెట్ల మీద విపరీతమైన ప్రభావం చూపింది. దిగ్గజ పారిశ్రామిక వేత్తలు కూడా భారీ నష్టాలను చవి చూడాల్సి వచ్చింది. అయితే తాజాగా.. ఇరుదేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన వాణిజ్య చర్చల్లో భాగంగా ఈ సుంకాలను తగ్గించుకోవడానికి నిర్ణయం తీసుకున్నారు.

## ఆ పదవి దక్కలేదన్న అక్కసుతోనే మాట్లాడుతున్నారు..

ఈటలపై టీపీసీసీ చీఫ్ ఫైర్

**హైదరాబాద్, :** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఏ కులమో చెప్పాలి..అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కలేదన్న అక్కసుతో ఈటల మాట్లాడుతున్నారు. సీఎంపై మాట్లాడిన తీరు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉంది. బీఆర్ఎస్ హయంలో ఆర్థిక మంత్రిగా ఈటల ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసింది...అని మహేష్ గౌడ్ ఆరోపించారు. హైడ్రా గురించి మాట్లాడే ఈటల దేవాదాయశాఖ భూములను కబ్జా చేశారని కేసు ఉన్న విషయం మర్చిపోయారా?. బీసీ బిడ్డవై కేసీఆర్‌కి అడుగులకు మడుగులు వత్తిన విషయం మరిచావా?. కేసీఆర్ హయంలో చేతకాని, దద్దమ్మ మంత్రులుగా ఉన్న మీరు సీఎం రేవంత్ గురుంచి మాట్లాడే నైతిక అర్హత లేదు. 60 వేల ఉద్యోగాలు ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ పడిపోతుందా?. ధనిక రాష్ట్రమైన తెలంగాణ దివాలా తీయడానికి.. కారణమైన కేసీఆర్ అలీబాబా చోరిస్‌లో ఈటల ఒకరు.. అని మహేష్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు ఈటల, బండి సంజయ్ ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడం లేదు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ నేతలు అడుగడుగునా అడ్డు పడుతున్నారు. బీసీ బిడ్డగా ఈటల, బండి సంజయ్‌ను ఎవరు అంగీకరించని పరిస్థితిలో లేరు. బీసీ బిల్లు విషయంలో బీజేపీ నేతల వైఖరిని బీసీ సమాజం క్షమించే పరిస్థితి లేదు. తప్పులు ఎత్తి చూపండి.. సద్విమర్శ చేయండి.. అంతేగాని స్వార్థంతో నోటికొచ్చింది మాట్లాడితే సహించే ప్రసక్తే లేదు..అని టీపీసీసీ చీఫ్ వార్నింగ్ ఇచ్చారు.

# అరుగుపై కూర్చొని అర్జీలు స్వీకరిస్తూ

కటిక నేలపై కూర్చొని కష్టాలు తెలుసుకుంటూ
ఆదివాసీ జనంతో మమేకమైన
ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి
పూర్తిగా అటవీ ప్రాంతంలో కొనసాగిన పర్యటన
రూ.2.47 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
పేరాయిగూడెం, చెన్నాపురం అటవీ ప్రాంతాల్లో
పర్యటించిన తొలి ఎంపీ అంటూ కృతజ్ఞతలు
తెలిపిన ఆదివాసీలు



ఇలా వాగులూ వంకలూ దాటుకొని ఆదివాసీ గూడేల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రాఘురాం రెడ్డి సోమవారం







అశ్వారావుపేట,**(నేటి శుభోదయ):** పూర్తిగా అటవీ ప్రాంతం ఖమ్మం నుంచి 160 కిలోమీటర్ల దూరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నుంచి 34 కి. మీ. దూరం అంతా దట్టమైన ప్రాంతం గుండా పెద్ద వాగు, అనంతారం, చిన్న వాగు, కట్లంవాగు విస్తృతంగా పర్యటించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మారుమూల ఆదివాసీ పేరాయిగూడెం రూ. 1.40కోట్లు, చెన్నాపురంలో రూ. 1.07 కోట్లు.. మొత్తం రూ.2.47 కోట్ల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పేరాయిగూడెం గ్రామ పంచాయతీ వద్ద అరుగుపై ఎంపీ రఘురాం రెడ్డి కూర్చొని గ్రామసభ నిర్వహించారు. చెన్నాపురం గ్రామంలో గ్రామ సెంటర్ లో సీ సీ రోడ్లను ప్రారంభించి అక్కడ నేలపై వేసిన పట్టాపై కింద కూర్చొని ఆదివాసీల యోగక్షేమాలు తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి తన లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వేలాది కోట్లను వెచ్చిస్తోందని చెప్పారు. వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### మంచో పరసోదమ్ అంటూ కృతజ్ఞతలు తెలిపిన ఆదివాసీలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా సరిహద్దులో గల తమ గ్రామాలకు వచ్చి, నిధులు కేటాయించి అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ రామ సహాయం రెడ్డికి ఆయా గ్రామాల ఆదివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకు యే ఎంపీ తమ వద్దకు రాలేదని తెలిపారు. మంచి పరసోదమ్ సార్ అంటూ ( చాలా ధన్యవాదాలు) అంటూ ఆదివాసి భాషలో కృతజ్ఞతలు తెలిపారు.

# భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార
పౌరసంబంధాల శాఖామాత్యులు
పొంగులేటి శ్రీనివాసరెడ్డి
భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులలో
వచ్చిన సమస్యల పరిష్కారంపై జిల్లా
కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా
సమీక్షించిన మంత్రివర్యులు పొంగులేటి





ఖమ్మం,**(నేటి శుభోదయ):** రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర



రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులపై పైలెట్ మండలాలు నారాయణపేట, ములుగు, కామారెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు క్రింద చేపట్టిన 4 మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు.



రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, మనం ఏదైనా దరఖాస్తు తిరస్కరిస్తే దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. సానుకూలంగా ఉన్న దరఖాస్తుల ఆమోదం భూ భారతి పోర్టల్ ద్వారా అందించాలని అన్నారు. భూ సర్వేకు సంబంధించిన సమస్యలు, ఆర్.ఎస్.ఆర్. ఎక్సెస్ సమస్యలు పరిష్కరించాలని, రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారం చూపాలని మంత్రి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో 3 వేల 224 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1726 సాదా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, వీటిలో 1179 స్క్రూటిని చేశామని, వారం 10 రోజుల్లో పరిష్కరిస్తామని అన్నారు. సాదా బైనామా దరఖాస్తులు కాకుండా వచ్చిన 1498 దరఖాస్తులలో 581 దరఖాస్తులు పరిశీలించి 146 ఆమోదించి, 435 తిరస్కరించామని అన్నారు. తిరస్కరించిన ప్రతి దరఖాస్తుకు సరైన కారణం ఉందని అన్నారు. 172 దరఖాస్తులకు డాక్యుమెంట్లు లేని కారణంగా, పొజిషన్ లేకుండా భూమి లేకుండా పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులు, మైనింగ్ కు లీజుకు ఇచ్చిన భూముల పట్టా కోసం వచ్చిన దరఖాస్తులు వంటి కారణాలతో తిరస్కరణ జరిగిందని అన్నారు. ఆర్.ఎస్.ఆర్. వేరియేషన్ ఉన్న 315 సర్వే నెంబర్ల పరిశీలన తర్వాత 112 సర్వే నెంబర్ల సమస్యలను డెస్క్ వర్క్ తో పరిష్కరించామని, మిగిలిన వాటికి క్షేత్ర స్థాయి సర్వే అవసరం ఉందని అన్నారు. రాబోయే 10 రోజుల్లో సర్వే పూర్తి చేసి భూ సమస్యలు పరిష్కరించేలా కార్యాచరణ చేపట్టామని, 94 అసైన్మెంట్ దరఖాస్తులు వచ్చాయని అన్నారు. సాదా బైనామా దరఖాస్తులు పొజిషన్ చెకింగ్, ఆర్.ఎస్.ఆర్. సమస్యలకు సర్వే చేయాల్సి ఉందని, వీటిని 10 రోజుల్లో పూర్తి చేస్తామని అన్నారు. ఈ వీడియో సమావేశంలో ఖమ్మం ఆర్డీఓ జి. నరసింహా రావు, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబం వలే పనిచేయడం వల్లనే నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు ఏవి ఉన్న పరిష్కరించడానికి నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను

మనం అందరం ఒకటే అన్న భావన కలిగించడానికి లైన్మెన్ నుంచి సిఎండి వరకు యూనిఫామ్ తీసుకురావాలని ఆలోచన

విద్యుత్ సిబ్బందికి నిఫ్టతో డిజైన్ చేయించి డ్రెస్సులు ఇస్తాం

మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధి చేయడానికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం

విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది ఇంట్రాక్షన్ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి





ఖమ్మం, మధిర,**(నేటి శుభోదయ):** విద్యుత్తు డిమాండ్ ఎంత పెరిగినప్పటికీ క్షణం కూడా అంతరాయం లేకుండా నిరంతరంగా విద్యుత్తును సరఫరా చేసే స్థాయికి ఈ రాష్ట్రం ఎదగడానికి అకుంఠిత దీక్ష, నిబద్ధతతో సిబ్బంది కుటుంబం వలె పనిచేయడం వల్లనే సాధ్యమైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్ ప్రజాభవన్ లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్, మెయింటెనెన్స్ సిబ్బందితో గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఇంట్రాక్షన్ అయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్ పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ట్రాన్స్ కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భాస్కర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరెంటు ఉండదని దుష్ప్రచారం చేసిన వారికి చెంపపెట్టు లాగా ఈ ఏడాది మార్చి లో 17,162 మెగావాట్లకు పైగా పిక్ డిమాండ్ వచ్చినప్పటికీ ఒక్క నిమిషం కూడా కరెంటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసి వారి విమర్శలను తిప్పి కొట్టిన విద్యుత్తు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఉన్నత స్థాయిలో నేను, యజమాన్యాలు తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో అమలు చేస్తున్న మీ సేవలను గుర్తించి అభినందించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్తు సంస్థలను బలోపేతం చేసుకుని క్షణం కూడా అంతరాయం లేకుండా నిరంతరంగా విద్యుత్తు ను సరఫరా చేసే స్థాయికి ఎదగడానికి అధికారులతో సహా క్షేత్రస్థాయి సిబ్బంది అకుంఠిత దీక్ష, నిబద్ధతతో పనిచేయడం వల్లనే సాధ్యమైందన్నారు. ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న సిబ్బందిని ప్రజా ప్రభుత్వం ఎప్పటికీ ప్రోత్సహిస్తుందని అందులో భాగంగానే దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పదోన్నతుల సమస్యను అధికారులంలోకి రాగానే పరిష్కరించి వేల మందికి పదోన్నతులు కల్పించామన్నారు. మనందరం ఒకటే అన్న భావన కల్పించేందుకు డిస్కం కంపెనీలో పనిచేస్తున్న లైన్మెన్ నుంచి సీఎండి వరకు ఒకే తరహా యూనిఫాం తీసుకురావాలని ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు అదే విధంగా నిఫ్ట తో డిజైన్ చేయించి విద్యుత్ సిబ్బందికి డ్రెస్సులు ఇస్తామని ప్రకటించారు. నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం మాది కాదని, ప్రతి ఆలోచన అందరితో పంచుకుంటామని, అందరి ఆలోచనలు తీసుకుని నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వం మనదన్నారు విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు ఏవి ఉన్న ప్రజా ప్రభుత్వం స్పందిస్తుంది, పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. యజమాన్యం తో పరిష్కారం కానటువంటి సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ నేను అందుబాటులో ఉంటానని విద్యుత్ సిబ్బందికి భరోసా ఇచ్చారు. సంపద సృష్టించే ప్రధాన రంగాలైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ కి పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. రీజినల్ రింగ్ రోడ్, మూసి పునర్జీవం ఫ్యూచర్ సిటీ అభివృద్ధితో త్వరితగతిన అభివృద్ధి చెందే రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం నమోదు కానుంది అన్నారు. రాష్ట్రంలో సాఫ్ట్వేర్ ఇండస్ట్రీ విస్తరణతో పాటు డేటా సెంటర్స్ ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలకు కావలసిన విద్యుత్తు గురించి ప్రణాళికలు తయారు చేసుకుని ముందుకు వెళ్తున్నామని వివరించారు. న్యూ ఎనర్జీ పాలసీ తీసుకురావడం వల్ల రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తితో మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంతో పాటు ఇతర రాష్ట్రాలకు విద్యుత్ అమ్మే స్థాయికి అభివృద్ధి చేస్తామన్నారు. విద్యుత్ ఉత్పత్తి విషయంలో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో వచ్చే అవకాశాలు అందిపుచ్చుకొని ముందుకు వెళున్నామని వివరించారు. థర్మల్, సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వంతోనూ, హైడల్ పవర్ ఉత్పత్తి చేయడానికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలతో ఎం ఓ యు చేసుకున్నామని వివరించారు. విద్యుత్ సంస్థలు పనిచేస్తున్న మీరందరూ గర్వపడే విధంగా విద్యుత్ రంగ సంస్థలను ప్రజాప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని అన్నారు.





## అధికారులపై హెూంమంత్రి అనిత సీరియస్..

### చర్యలు తప్పవని వార్నింగ్..



**అమరావతి,:** అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఏపీ హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత.. విజయనగరం కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశానికి హాజరైన ఆమె.. డీఆర్సీలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఏదో కాకి లెక్కలతో కాగితాల దొంతులుగా ప్రెస్‌నోట్ మా కిచ్చి వెళ్లిపోతున్నారని ఫైర్ అయ్యారు.. కానీ, ఆ పేపర్లు తర్వాత చెత్త బుట్టలోకి వెళ్లిపోతున్నాయి.. అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు.. కానీ, ఇక ఇలాంటి పద్ధతికి చెల్లు చీటు చెప్పండి ఇక నుంచి ముందే కలెక్టర్ వద్ద గత డీఆర్సీలో ఏం చేశామో చర్చించండి.. ఎంత వరకు పూర్తి చేశామో ముందే బ్రీఫ్ చేసి పెట్టుకోండి అని ఆదేశించారు.. విజయనగరం వెనుకబడిన జిల్లా అంటారు.. ఎవ్వరన్నారు వెనుకబడిన జిల్లా అని జిల్లాకి అన్ని వనరులు ఉన్నాయి.. వర్షపాతం అధికంగా ఉన్నాయి.. నీటి నిలువలు అధికంగా ఉన్నాయన్నారు హెూంమంత్రి అనిత.. అధికారులు ఏం పని చేస్తున్నారో నాకు అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ డీఆర్సీలో ప్రజాప్రతినిధులు ఏ సమస్యలు లేవనెత్తినా.. ఆ తర్వాత అది ఎంత మేర పరిష్కరించగలిగామో చెప్పాలి.. లేనిపక్షంలో కచ్చితంగా చర్యలు తప్పవు అని వార్నింగ్ ఇచ్చారు.. ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.. గతంలో హెవీ లోడ్స్ తో వెళ్లిన వాహనాలు ఎన్ని ఉన్నాయో ఆర్ అండ్ బీ, ఆర్టీవో సమన్వయంతో గుర్తించాలని అడిగా కానీ, ఇంత వరకు ఎందుకు సమన్వయ సమావేశం పెట్టుకోలేదు? అని నిలదీశారు.. ఇలా అయితే సస్పెండ్ చేయాల్సి ఉంటుందని ఆర్ అండ్ బీ అధికారులపై మంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు..

## హైడ్రాతో సీఎం రేవంత్ రెడ్డి దారుణంగా వ్యవహరిస్తున్నారు..



**హైదరాబాద్, :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా మండిపడ్డారు. హైడ్రాతో ముఖ్యమంత్రి దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 1965లో అల్వాల్ లో 50 ఏళ్ల క్రితం ఏర్పడ్డ ఓ కాలనీ ఉంది.. ఈ కాలనీకి ఇంటింటికీ నోటీసులు ఇవ్వడమే కాకుండా.. చివరికి గుడులకు కూడా నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ఒక తరం త్యాగం చేస్తే.. రెండో తరం ఇల్లు కట్టుకుంది.. మూడో తరం చదువుకుంటోంది అని గుర్తు చేశారు. బాలాజీ నగర్, అరుందతి నగర్ లో ఇలా ఉంది పరిస్థితి.. ఇక, ప్రజల జీవనంలో మంచి మార్పు వస్తదని ముఖ్యమంత్రిని చేస్తే.. నేను ఎవరు చెప్పినా వినను.. నాకు నేను నిర్ణయం తీసుకుంటానంటున్నాడు.. హైడ్రా పేరుతో పక్కా ఇల్లు కూలగొట్టుడే.. అడ్డమొచ్చిన వాళ్లను బుల్డోజర్లతో తొక్కవలసిందే అన్నట్లుగా రేవంత్ రెడ్డి స్టేట్ మెంట్ ఇస్తున్నాడని ఎంపీ ఈటల అన్నారు. అయితే, ఇంటెలిజన్స్ వ్యవస్థ అయినా ఇక్కడి ప్రజల పరిస్థితి చెప్తుంటరు కదా.. అయినా సీఎం రేవంత్ ఎందుకు వినడం లేదని బీజేపీ ఎంపీ ఈటల ప్రశ్నించారు. ఎవరు చెప్పినా వినని వారిని నాయకుడు అనరు.. సైకో అంటారని విమర్శించారు. ఇక, ప్రజలు కంటి మీద కునుకు లేకుండా బాధపడుతూ.. ఆత్మహత్య చేసుకుంటుంటే.. నవ్వే వాళ్లను సైకో అంటారు.. కోర్టుల్లో అడ్వకేట్లు వాదిస్తరు.. అంతిమ న్యాయనిర్ణేత జడ్జిది ఉంటది.. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ కర్తవ్యం ఆ పార్టీకి ఉంటది.. ఆయా పార్టీల ఎజెండా ఆయా పార్టీలకు ఉంటది.. కానీ, అంతిమంగా న్యాయ నిర్ణేతలు ప్రజలే ఉంటారు అని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు.

## రెండేళ్లలో పరిగి ప్రజలకు కొత్త హాస్పిటల్ అందుబాటులోకి



**హైదరాబాద్, :**వికారాబాద్ జిల్లా పరిగిలో హాస్పిటల్ భవనం నిర్మాణానికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పరిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద బెడ్ల ఏరియా హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌కు సుమారు రూ.26 కోట్ల వ్యయం వెచ్చించి, రెండు సంవత్సరాల్లో కొత్త హాస్పిటల్‌ను ప్రజల సేవ కోసం అందుబాటులోకి తెచ్చే దిశగా వారు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. హాస్పిటల్‌లో అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రత్యేకంగా, కిడ్నీ పేషెంట్ల కోసం డయాలసిస్ సెంటర్‌లో బెడ్లు, మిషన్ల సంఖ్య పెంచే ప్రక్రియను ప్రారంభించామన్నారు. హాస్పిటల్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా, రోడ్డు ప్రమాదాలు , ఇతర ఎమర్జెన్సీల్లో ప్రజల ప్రాణాలు కాపాడే సదుపాయాలు అందజేస్తామని చెప్పారు. అంబులెన్స్ సేవలను మరింత మెరుగుపరచేందుకు, కొత్త అంబులెన్స్‌లు తీసుకురావడంపై దృష్టి పెట్టిన మంత్రి, ముఖ్యంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్‌ను పది నిమిషాలకు తగ్గించే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవలే 213 కొత్త అంబులెన్స్‌ను గౌరవ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, భవిష్యత్తులో మరిన్ని అంబులెన్స్లు అందుబాటులోకి తీసుకొచ్చే వాగ్దానం చేశారు. పరిగిలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసే దిశగా పరిశీలన చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గతేడాది 16 కొత్త నర్సింగ్ కాలేజీలను ప్రారంభించడం, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో నర్సింగ్ విద్యను అందించడం, యువతకు దేశం , విదేశాలలో ఉద్యోగ అవకాశాలు అందించేందుకు ప్రోత్సహించడం జరుగుతోందని చెప్పారు. 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసినట్లు, మరో 2300 పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా త్వరలో పూర్తి కానున్నట్లు వెల్లడించారు. హెల్త్ క్యాంపెయిన్లు నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌సీడీ (నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్) క్లినిక్స్ ఏర్పాటు చేయడం, అలాగే 4 రీజనల్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు పై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. ప్రజలు తమ ఆహార అలవాట్లను సరిదిద్దుకుని, వ్యాయామం చేయడం ద్వారా వ్యాధుల నుండి రక్షించుకోవాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటళ్ల రూపురేఖలను మార్చి, వాటిని ఆకర్షణీయంగా , పేషెంట్లకు సౌకర్యవంతమైన వాటిగా మారుస్తామని, ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించబడతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందరె రెడ్డి పాల్గొన్నారు.

## భారత రక్షణ శాఖకు విరాళం అందించిన ఇళయరాజా..

ఏప్రిల్ 22, 2025న కాశ్మీర్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడి తర్వాత.. భారత్ పాక్ మధ్య పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్ గుండెల్లో గుబులు పుట్టిస్తుంది భారత్. ఇప్పటికే వందల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టింది భారత్. అయినప్పటికి భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో దేశం మొత్తం హై అలర్ట్ ప్రకటించింది. అయితే, తర్వాత కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఇరు దేశాల సరిహద్దుల్లో శాంతి నెలకొంది. అయితే ఈ విషయం పై ఇప్పటికే నటినటులు సెలబ్రెటీలు అంతా కూడా రియాక్ట్ అవుతూ భారత రక్షణ శాఖకు తోచినంత సహాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు, రాజ్యసభ సభ్యుడు ఇళయరాజా భారత రక్షణ శాఖకు తన ఒకరోజు పారితోషికాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ విషయాన్ని ఇళయరాజా తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. 'పహల్గామ్‌లో మన దేశ పర్యాటకులపై ఉగ్రమూక దాడి చేసింది. దీనికి మన దేశ సైనికులు తప్పక ప్రతీకారం తీర్చుకోవాలి. వారి ధైర్య సాహసాలు అభినందనీయం. మన సైనికులు ఆత్మస్థైర్యంతో వారిని మట్టు పెడతారనే నమ్మకం నాకు ఉంది. దేశ పౌరుడిగా, ఎంపీగా నా ఒకరోజు పారితోషికాన్ని దేశ రక్షణ శాఖకు విరాళంగా ప్రకటిస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు.

# సుందర సౌరాష్ట్ర..సమైక్య యాత్ర



వడోదరలో పూల గడియారం... అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం. గాంధీనగర్‌లో అక్షరధామ్... పోర్‌బందర్‌లో కీర్తిమందిర్. ద్వారకలో కృష్ణుడి జగత్‌మందిర్...

కేలాడియాలో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ.

జామ్‌నగర్ లఖోటా కోట... సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం.

1 రోజు

సికింద్రాబాద్- పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. ఇది ఎనిమిది రోజుల టూర్. ఇందులో వడోదర, అహ్మదాబాద్, ద్వారక, సోమనాథ్, పోర్‌బందర్ కవర్ అవుతాయి.

2వ రోజు

ఉదయం పదకొండు గంటలకు రైలు వడోదర స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి హెూటల్ గదిలో చెక్ ఇన్ అవాలి. మధ్యాహ్నం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విగ్రహాన్ని చూడడానికి తీసుకెళ్తారు (ఎంట్రీ టికెట్ ప్యాకేజ్‌లో వర్తించదు, పర్యాటకులు కొనుక్కోవాలి). రాత్రికి వడోదర హెూటల్ గదిలో బస. రాజ్యాలన్నింటికీ ఒకటే జెండా: స్టాచ్యూ ఆఫ్ యూనిటీ... స్వాతంత్ర్యసమరయోధుడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం. దీని ఎత్తు 597 అడుగులు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం. గుజరాత్ రాష్ట్రం, కెవాడియా ప్రదేశంలో ఉంది. నర్మదానది మీద నిలబడి సర్దార్ సరోవర్ డ్యామ్‌ను చూస్తున్నట్లు ఉంటుంది. వడోదరకు వందకిలోమీటర్ల దూరం. దేశంలోని రాజ్యాల మధ్య ఐక్యత కోసం, జమీందారాలన్నింటినీ భారత్ రిపబ్లిక్‌లో విలీనం చేసి ఒక పతాకం కిందకు తీసుకురావడానికి పటేల్ చేసిన కృషిని గౌరవిస్తూ ఆయన విగ్రహానికి స్టాచ్యూ ఆఫ్ యూనిటీ అనే పేరు పెట్టారు.

3వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత వడోదరలో హెూటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. నగరంలో లక్ష్మీవిలాస్ ?లెస్ తదితరాలను చూసిన తర్వాత అహ్మదాబాద్‌కు ప్రయాణం. అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం, అక్షరధామ్ టెంపుల్ చూసిన తర్వాత హెూటల్ చెక్ ఇన్. రాత్రి బస. ప్యాలెస్‌లో స్టెప్‌వెల్: వడోదర... చారిత్రక ప్రాధాన్యత ఉన్న నగరం. ఈ నగరం విశ్వామిత్రి నది తీరాన ఉంది. నగరంలో మహరాజా షాయాజీరావు యూనివర్శిటీ... సిటీ హాల్... ఇలా ప్రముఖమైన కట్టడాలన్నీ రాజా పేరుతోనే ఉంటాయి. ప్యాలెస్‌ల ఆర్కిటెక్చర్ అద్భుతంగా ఉంటుంది. గైక్వాడ్ రాజకుటుంబం నివసించిన మహారాజా ప్యాలెస్‌లో సర్కార్‌వాడా, లక్ష్మీవిలాస్ ప్యాలెస్, ప్రతాప్ ప్యాలెస్, మోతీబాగ్ ప్యాలెస్, మోతీబాగ్ స్టేడియం, మహారాజా ఫతే సింగ్ మ్యూజియం, జూ, నవలాక్షి స్టెప్ వెల్ ఉన్నాయి. ఇది తొమ్మిది మిలియన్ల గ్యాలన్ల నీటిని స్టోర్ చేయగలిగిన బావి. ఇక లక్ష్మీ ప్యాలెస్ అయితే ఇటాలియన్ మార్బుల్ ఫ్లోరింగ్, గోడలకు మొజాయిక్ డెకరేషన్, టెర్రకోట శిల్పాలు... ఇలా ప్రతిదీ ఒక కళాఖండమే. ఫతే సింగ్ మ్యూజియం కూడా ఇదే ప్రాంగణంలో ఉంది. ఇందులో గ్రీకు, రోమన్, యూరప్ శిల్పాలు, ఫ్రెంచ్ ఫర్నిచర్ ఉంది. రాజారవివర్మ చిత్రలేఖనాలు కూడా ఉన్నాయి. షాయాజీ రావు గైక్వాడ్ ఆధునిక వాది. నగరాన్ని శాస్త్రసాంకేతికంగా వృద్ధి చేశాడు. అంబేద్కర్ విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించాడు.

4వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హెూటల్ గది చెక్ అవుట్ చేసి ద్వారక వైపు సాగి?వాలి. దారిలో జామ్ నగర్‌లోని లఖోటా ప్యాలెస్, మ్యూజియం విజిట్. సాయంత్రానికి ద్వారక చేరి హెూటల్ చెక్ ఇన్, రాత్రి బస. సరస్సులో కోట: కోటల చుట్టూ కందకాలుంటాయి. కానీ ఇక్కడ నీటి మధ్యలో దీవి మీద కోట ఉంటుంది. లఖోటా సరస్సు మధ్యలో ఉన్న కోట కావడంతో దీనిని లఖోటా కోట అనే పిలుస్తారు. జామ్‌నగర్ పాలకులు ఉపయోగించిన వస్తువులతోపాటు నాటి కళాకృతులతో కోటలోపల మ్యూజియం ఉంది.

ఐదవ రోజు

ఉదయం ద్వారకాధీశుని దర్శనం, బేట్ ద్వారక, నాగేశ్వర్ టెంపుల్ దర్శనం. ఆ తర్వాత ద్వారకకు తిరుగు ప్రయాణం. రాత్రి బస ద్వారకలోనే. బీసీ కాలపు జగత్‌మందిర్: కృష్ణుడు పూజలందుకునే ఈ ఆలయాన్ని ద్వారకాధీశ్ మందిర్ అంటారు. ఐదంతస్థుల ఆలయం మనకు విచిత్రంగా అనిపిస్తుంది. క్రీ.పూ రెండు వందల ఏళ్ల నాటిదని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. మనకు ఇప్పుడు కనిపిస్తున్నది క్రీ.శ 15-16 శతాబ్దాల నాటి పునర్నిర్మాణం. ఆలయాలు పశ్చిమముఖంగా ఉండడం కూడా అరుదైన విషయం. ఆలయంఅరేబియా సముద్రాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. తెలుగు రాష్ట్రం చిత్తూరు జిల్లా, నాగులాపురంలోని వేదనారాయణస్వామి ఆలయంలో విష్ణుమూర్తి పశ్చిమముఖంగా ఉంటాడు.

6వరోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హెూటల్ గది చెక్ అవుట్ చేసి సోమనాథ్ వైపు సాగిపోవాలి. దారిలో పోర్‌బందర్‌లోని కీర్తిమందిర్, సుధామ టెంపుల్ విజిట్. సోమనాథ్ చేరిన తర్వాత సోమనాథ జ్యోతిర్లింగ దర్శనంతోపాటు ఆలయం చుట్టు పక్కల ఉన్నవాటిని తిరిగి చూడడం, సాయంత్రం తర్వాత పోర్‌బందర్‌కు ప్రయాణం. రాత్రికి పోర్ బందర్ రైల్వే స్టేషన్‌కి చేరడంతో యాత్ర పూర్తవుతుంది.

145 ఏళ్లుగా ఆగని గడియారం:

ఫ్లోరల్ క్లాక్... వడోదర సిటీసెంటర్‌లోని షాయాజీ బాగ్‌లో ఉంది. క్రీ.శ 1879లో మూడవ మహారాజా షాయాజీరావు నిర్మించాడు. 13 ఎకరాల ఉద్యానవనంలో బరోడా మ్యూజియం అండ్ పిక్చర్ గ్యాలరీ, ఒక జూ, సర్దార్‌పటేల్ ప్లానిటోరియం... గార్డెన్ మొత్తం చూడడానికి టాయ్‌ట్రైన్ ఉన్నాయి. ప్లానిటోరియం పక్కనే ఆస్ట్రానమీ పార్క్ ఉంది. పురాతన కాలంలో వాడిన ఆస్ట్రనామికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా ఉన్నాయి. బరోడా మ్యూజియంలో పిక్చర్ గ్యాలరీలో మినియేచర్ కళాఖండాల నిలయం. హాజీరా మఖ్బారా, న్యాయమందిర్, దభోయి ఫోర్ట్, మకాయ్ కోట, జమామసీదు, కీర్తి మందిర్, అరబిందో సొసైటీ చూడవచ్చు. స్థానికులు గుజరాతీతోపాటు సింధీ భాష కూడా మాట్లాడతారు. అహ్మదాబాద్: అహ్మదాబాద్ గురించి మాట్లాడాలంటే సబర్మతి నది గురించి మాట్లాడాలి. నదికి రెండువైపులా విస్తరించిన నగరం ఇది. ఒక వైపు వాళ్లు మరో వైపుకు రావడానికి నగరంలో ఈ నది మీద పదకొండు వంతెనలున్నాయి. ఎల్లిస్, గాంధీ, నెహ్రూ, సుభాష్, వాదాజ్ దూధేశ్వర్, సర్దార్, చంద్రభాగా, అంబేద్కర్, లాల్ బహదూర్ శాస్త్రి, ఫెర్నాండెజ్, దండి బ్రిడ్జిలు. బ్రిటిష్ పాలకుల తోపాటు జాతీయనాయకులను గౌరవిస్తూ నామకరణం చేయడం గొప్పగా అనిపిస్తుంది. మీరు నగరంలో ఏ వంతెన మీద ప్రయాణించారో సరదాగా గమనించండి. సబర్మతి రివర్ ఫ్రంట్ సూర్యోదయాలు, సాయంత్రాలను ఆస్వాదించడానికి మంచి ప్రదేశం. ఇక మనకు చిన్నప్పటి నుంచి చిరపరిచితమైన సబర్మతి ఆశ్రమం గాంధీజీ నివసించిన ప్రదేశం. ఇక్కడ జాతీయోద్యమ చర్చలు జరిగేవి. గాంధీజీ దండి సత్యాగ్రహాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఇప్పుడు ఆశ్రమంలో గాంధీజీ ఉపయోగించిన వస్తువులను చూడవచ్చు. నగరంలో సయ్యద్ సిద్ధిఖీ జాలీలో రాతిలో సునిశితంగా చెక్కిన డిజైన్‌ని తప్పకుండా చూడాలి. జైన్ మందిరం, కాలికో మ్యూజియం, సర్దార్ పటేల్ మ్యూజియం కూడా చూడాల్సిన ప్రదేశాలు.

ప్రశాంత ధామం: అక్షరధామ్ టెంపుల్ గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఉంది. అహ్మదాబాద్‌కు 40 కిమీల దూరం. నగరంలో రాజధాని హడావుడి, ట్రాఫిక్ జామ్‌లు ఉండవు. అసెంబ్లీ, సెక్రటేరియట్, ప్రభుత్వ ఆఫీసులు, వాటి అనుబంధ భవనాలు తప్ప ఇతర వర్తక వాణిజ్యాలు ఉండవు. నగరం ప్రశాంతంగా ఉంటుంది.

గాంధీజీ ఇక్కడే పుట్టాడు:

పోర్‌బందర్.... గాంధీజీ పుట్టిన నేల. ఇక్కడ గాంధీజీ పుట్టిన ఇల్లు బాపూ మహల్ ఉంది. దాని పక్కనే స్మారక మందిరం కీర్తిమందిర్, బాపూ మహల్ వెనుకగా కస్తూర్బా గాంధీ ఇల్లు ఉన్నాయి. గాంధీజీ ఇంటిలో అటకల నిర్మాణాన్ని గమనించాలి. పోర్‌బందర్‌లో శ్రీకృష్ణుని స్నేహితుడు సుధాముడికి మందిరం, వాళ్ల గురువు సాందీపుడి మందిరం ఉన్నాయి. సుధాముడి మందిరం విశాలంగా ఉంటుంది. ఇక్కడ భక్తులకు ప్రసాదంగా అటుకుల ?కెట్ ఇస్తారు. ఈ ఐటెనరీ ప్రకారం సోమనాథ్ నుంచి తిరుగు ప్రయాణంలో పోర్‌బందర్‌కు చేరే ప్రయాణం అరేబియా తీరం వెంబడే సాగుతుంది. కాబట్టి జర్నీలో సూర్యాస్తమయాన్ని ఆస్వాదించవచ్చు. సోమనాథ జ్యోతిర్లింగం: సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం ఓ గొప్ప ఆధ్యాత్మిక అనుభూతి. సోమనాథుడిని దర్శనం తర్వాత ఆలయం ఆవరణలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను చూడవచ్చు. ఆలయం బేస్ మెంట్ ఎత్తుగా ఉంటుంది. ఆలయం వెనుక సముద్రపు అలలు ఆలయాన్ని అలవోకగా తాకుతూ ఉంటాయి. ఆయలం ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విగ్రహం నమూనాలోనే ఉంటుంది. నర్మద తీరాన పెద్ద విగ్రహస్థాపనకు ముందు నుంచే సోమనాథ్ ఆలయ ప్రాంగణంలో ఈ విగ్రహం ఉంది.

7వ రోజు

00.50 నిమిషాలకు (అర్ధరాత్రి 12.50 నిమిషాలు) ట్రైన్ నంబరు 20968 పోర్ బందర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ?ోర్‌బందర్ స్టేషన్ నుంచి బయలుదేరుతుంది.

8వ రోజు...

ట్రైన్ ఉదయం 8.20 నిమిషాలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుతుంది. బుధవారం మొదలైన పర్యటన బుధవారంతో పూర్తవుతుంది. ఈ ట్రైన్ అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఇదే రైలు తిరిగి సికింద్రాబాద్ నుంచి పోర్‌బందర్‌కు బయలుదేరుతుంది. ఇది వీక్లీ ట్రైన్.

ప్యాకేజ్ ధరల వివరాలు..

సుందర సౌరాష్ట్ర (ఎస్‌హెచ్‌ఆర్066) టూర్‌లో భాగంగా... ట్రైన్ నంబర్ 20967 సికింద్రాబాద్- పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. కంఫర్ట్ కేటగిరీ అంటే థర్డ్ ఏసీలో ప్రయాణం. ఇందులో ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 30 వేలు, ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 29 వేలవుతాయి. స్టాండర్డ్ కేటగిరీలో ట్విన్ షేరింగ్‌కి దాదాపు 27 వేలు, ట్రిపుల్ షేరింగ్‌కి దాదాపు 26 వేలవుతుంది. ఇందులో సింగిల్ ఆక్యుపెన్సీకి అవకాశం లేదు. ?కేజ్‌లో నాలుగు బ్రేక్‌ఫాస్ట్‌లు, నాలుగు రాత్రి భోజనాలు ఇస్తారు.

# మహాద్భుతం.. బుద్ధవనం



నల్లగొండ: రెండు వేల సంవత్సరాల క్రితం ఆచార్య నాగార్జునుడు స్థాపించిన విజయపురి విశ్వవిద్యాలయం, ఇక్కడ విలసిల్లిన బౌద్ధమత ప్రాచుర్యం ఆధారంగా కృష్ణా తీరంలో (నాగార్జునసాగర్ తీరంలో) బుద్ధిస్టు హెరిటేజ్ థీం పార్కును బుద్ధవనం ప్రాజెక్టుగా మహాద్భుతంగా తీర్చిదిద్దారు. అభినవ బుద్ధుడు ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేల ఇది. ఆ చరిత్ర ఆధారంగానే సాగర్ తీరంలో 274 ఎకరాల్లో బుద్ధవనం (శ్రీపర్వతారామం), 30 ఎకరాల్లో విపశ్యన కేంద్రం నిర్మించారు. అష్టాంగ విభాగాలుగా దీని నిర్మాణం చేశారు. ఆసియా ఖండంలోనే సిమెంట్‌తో నిర్మించిన అతిపెద్ద మహాస్థూపం బుద్ధవనం. ఈ నెల 12వ తేదీన బుద్ధపూర్ణిమ సందర్భంగా ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు ఈ చారిత్రక ప్రదేశాన్ని సందర్శించనున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో బయలు దేరి వెల్లంకిలో కొంతసేపు సేద దీరి, నాగార్జునసాగర్‌కు చేరుకుంటారు. విజయవిహార్ అతిథిగృహంలో వారికి స్వాగత ఏర్పాట్లు చేశారు. విజయవిహార్ ముందు ఏర్పాటు చేసిన ఫొటో సెషన్‌లో పాల్గొంటారు. అనంతరం విజయవిహార్ వెనుకభాగంలో, సాగర్ తీరాన పచ్చికబయళ్లలో వారు ప్రత్యేకంగా ఫొటోలు దిగుతారు. ఆ తరువాత బుద్ధవనం చేరుకుంటారు. బుద్ధుని పాదుకల వద్ద 25 మంది బౌద్ధ సన్యాసులు నిర్వహించే బౌలికుప్ప మహాబోధి పూజల్లో పాల్గొంటారు. అక్కడినుంచి మహాస్థూపం వద్దకు చేరుకొని, వెనుక భాగాన ఉన్న మెట్ల ద్వారా పైకి ఎక్కుతారు. దానికి వంద అడుగుల దూరంలో ఏర్పాటు చేసిన గిరిజన సంప్రదాయ నృత్యాన్ని తిలకిస్తారు. అనంతరం మహాస్థూపం అంతర్భాగంలో అష్టబుద్ధుల వద్దకు చేరుకొని అక్కడ కొవ్వొత్తులు వెలిగించి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా బౌద్ధమత గురువు నిర్వహించే 5 నిమిషాల ప్రార్థనలో పాల్గొంటారు. అనంతరం రెండు నిమిషాల పాటు ధ్యానం చేస్తారు. అక్కడి నుంచి మహాస్థూపం చూట్టూ ఉన్న 2,500 విగ్రహాల గురించి పర్యాటక శాఖ ప్రతినిధి శివనాగిరెడ్డి వివరిస్తారు. అనంతరం జాతకవనంలోకి వెళతారు. అక్కడ వారికి బుద్ధవనం, తెలంగాణలో బౌద్ధ చరిత్ర ప్రాధాన్యత గురించి పర్యాటక శాఖ ప్రతినిధి వివరిస్తారు. బుద్ధుని పుట్టుక నుంచి నిర్యాణం వరకు ప్రత్యేక డ్రామాను ప్రదర్శిస్తారు.

### బుద్ధుని జీవిత విశేషాలు

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2003లో దీనిని ప్రారంభించింది. సిద్ధార్థ గౌతముని జీవితంలోని ప్రధాన ఘట్టాలను వర్ణించే అనేక నేపథ్య విభాగాలతో కూడినదే బుద్ధవనం. ఆయన పూర్వ జన్మ కథలను చిత్రీకరించిన జాతక పార్క్, సూక్ష్మ స్థూపాలతో కూడిన స్థూపపార్క్, మహాస్థూపం, బౌద్ధ హెరిటేజ్ మ్యూజియం, మహాస్థూపం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆచార్య నాగార్జున విగ్రహం, 27 అడుగుల బుద్ధ విగ్రహం ఇందులో ఏర్పాటు చేశారు. ధమ్మ గంటను శ్రీలంక ప్రభుత్వం విరాళంగా ఇచ్చింది. దేశంలోనే ఇది మొదటిది.

### ప్రవేశ వేదిక

ప్రవేశ వేదిక అష్టమంగళ (ఎనిమిది శుభ) చిహ్నాలు, ఐకానిక్ రూపంలో బుద్ధుడు, జంతువులు, పక్షులు, బోధి వృక్షం, మిథునాలు (రసిక జంటలు), బుద్ధపాదాలు వంటివి ఇక్కడ ఉంటాయి. ప్రధాన ఇతివత్తాలు, సిద్ధార్థుని కిరీటం (జుట్టు) మోస్తున్న అగ్ని స్తంభం, నాగముచిలింద, పవిత్ర అవశేషాల ఆరాధన, మధ్యలో అశోక ధర్మ చక్రం స్తంభంతో శక్తివంతమైన విల్లును మోస్తున్న సిద్ధార్థుడు వంటి శిల్పాలు ఉంటాయి.

### బుద్ధ చరిత్రవనం

సిద్ధార్థ గౌతమ జీవితంలో ఐదు ప్రధాన సంఘటనలు ఉన్నాయి. అవి జననం, నాలుగు సమావేశాలు, మహా నిష్క్రమణ, జ్ఞానోదయం. బుద్ధుని మొదటి ఉపన్యాసం, మహాపరినిర్వాణం వంటి అంశాలపై చిత్రాలను కాంస్యంతో చేశారు. పల్నాడు సున్నపు రాయిలో చెక్కబడిన బుద్ధపాద స్లాబ్ అష్టమంగళ (ఎనిమిది శుభ) చిహ్నాలు ఉద్యానవన ప్రవేశ ద్వారం వద్ద ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయి.

### జాతక వనం (బోధిసత్వ పార్క్)

బోధిసత్వుడు బుద్ధుడిగా మారటానికి ముందు పది పరిపూర్ణతలను ఆచరిస్తూ జీవితాన్ని గడుపుతాడు. వాటినే దశపారమిత అంటారు. అవి దాన (ఉదారత), శీల (ధర్మం), శాంతి (సహనం), వీర్య (ధైర్యం), ధ్యాన (ఏకాగ్రత), ప్రజ్ఞ (జ్ఞానం), త్యాగ (త్యజించడం), సత్య (సత్యం), కరుణ (ప్రేమపూర్వక దయ), సమత (సమానత్వం). 547 జాతక కథలలో 40 జాతక కథలు అమరావతి, ఫణిగిరి, నాగర్జునకొండ, గోలి, జగ్గయ్యపేట, చందవరం బౌద్ధ క్షేత్రాలలోని అసలు శిల్పకళా ఫలకాల ఆధారంగా పల్నాడు లైమ్ స్టోన్‌లో చిత్రీకరించారు.

### ధ్యానవనం (మెడిటేషన్ పార్క్)

27 అడుగుల అవుకాన బుద్ధను ధ్యానవనంలో ఏర్పా టు చేశారు. దీనిని శ్రీలంక ప్రభుత్వం అందజేసింది.

### స్తూపవనం (మినియేచర్ స్తూప పార్క్)

కర్లా, అజంతా (మహారాష్ట్ర), సాంచి (మధ్యప్రదేశ్), సారనాథ్ (ఉత్తరప్రదేశ్), మంకియాలా, (పంజాబ్- పాకిస్తాన్), అనురాధపుర, శ్రీలంక, కహు-జో-దారో, మిర్పూర్ ఖాస్, పాకిస్తాన్, బౌధానాత్, మహాత్రాస్తాన్, నేపాల్‌లోని స్థూపాల ప్రతిరూపాలు ఇక్కడ ఏర్పాటు చేశారు. థాయ్‌లాండ్, పార్డో కాలింగ్ చోర్టెన్ టిబెట్, శ్వేసాండావ్-మయన్మార్, గ్యాంగ్జు, దక్షిణ కొరియా, భారతదేశం, ఆగ్నేయాసియాలోని బౌద్ధ స్థూప నిర్మాణాల రూపాలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

### మహాస్తూపం

బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రధాన ఆకర్షణ మహాస్తూపం. అమరావతిలోని అసలు స్థూపం కొలతలు, వాస్తుశిల్పం ప్రకారం దీనిని నిర్మించారు. దాని పైభాగంలో వేదిక (డ్రమ్), గోపురం (అండ), హార్మిక ఉన్నాయి. 42 మీటర్ల వెడల్పు, 21 మీటర్ల ఎత్తుతో దాని డ్రమ్, గోపురం భాగాలపై బౌద్ధ ఇతివృత్తాల శిల్ప ఫలకాలతో ఏర్పాటు చేశారు. మహాస్తూపం చుట్టూ గోడపై బుద్ధుని జీవితంలోని ముఖ్యమైన రాజులు, ధర్మ పోషకుల దశ్యాలు ఉంటాయి. గోపుర భాగంపై వజ్రాసన, బోధి వక్షం, అగ్ని స్తంభం, జాతక కథలు, బుద్ధుని జీవితంలోని సంఘటనలు వంటి బౌద్ధ చిహ్నాలను వర్ణించే శిల్పాలు చెక్కారు. స్థూపం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆచార్య నాగార్జున విగ్రహం ఉంటుంది.

### మహాస్థూపం లోపల వర్చువల్ ఆకాశ దృశ్యం

మహాస్థూపం లోపల 25 అడుగుల ఎత్తులో పంచధ్యాన బుద్ధులను ఏర్పాటు చేశారు. మహాస్తూపం పైకప్పు ఆకాశాన్ని తలిపిస్తూ తామరపువ్వ రేకుల ఆకారంలో ఉంటుంది. పైకప్పు లోపలి భాగం చిల్లులు గల ట్రాపెజోయిడల్ ప్యానెల్‌లతో ఆకాశాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి ఒక్కటి మరొకదానికి భిన్నంగా 2.5 మీటర్ల పరిమాణంలో, కాంతి థర్మోడైనమిక్స్, ప్రత్యేక ప్రకాశాన్ని జోడించేలా ఉంటాయి. ఇందులో లోటస్ రేకులు (960), స్కై ప్యానెల్‌లు (528) ఉంటాయి. ప్రపంచంలోనే తొలిసారిగా ఉపయోగించిన జర్మన్ టెక్నాలజీతో వీటిని ఏర్పాటు చేశారు.

### బుద్ధవనానికి అవార్డులు

విశిష్ట ఆకర్షణలతో కూడిన ఈ ప్రాజెక్టుకు అనేక అవార్డులు లభించాయి. పర్యాటకులకు ఉత్తమ పౌర సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను అందించినందుకు తెలంగాణ పర్యాటక శాఖ 2022లో అవార్డును అందజేసింది. దీనిపై నిర్మించిన డాక్యుమెంటరీకి ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం అవార్డును అందుకుంది. 2022లో కోల్‌కతాలో బౌద్ధ టూర్ ఆపరేటర్ల సంఘం 'భూటాన్ బంగ్లాదేశ్ ఇండియా అండ్ నేపాల్ టూరిజం మిత్ర అవార్డు'ను కూడా అందుకుంది.

### బౌద్ధ వారసత్వ ప్రాంగణం బుద్ధవనం

తెలంగాణలో బౌద్ధమతం ఆగమనం బుద్ధుని జీవితకాలం నాటిది. సుత్తనిపాత పారాయణవగ్గ ప్రకారం 'కవిట్టవనమిష్టి గోదావరి రివేరిన్'అనే బ్రాహ్మణ ఋషి బుద్ధుని బోధనలను వినడానికి తన 16 మంది శిష్యులను మగధకు పంపాడు. బుద్ధుని అనుచరులుగా మారిన పింగియా.. బుద్ధుని బోధనలను తీసుకువచ్చారు. అప్పటినుంచి నుంచి తెలంగాణలో థేరవాద, మహాయాన, వజ్రయాన బౌద్ధ శాఖలు విస్తరించాయి. అస్సీఫూట్, కోటిలింగాల, కంబాలపల్లి, పాశిగావ్, ధూళికట్ట, ఫణిగిరి, తిరుమలగిరి, వర్ధమానుకోట, గాజులబండ, నేలకొండపల్లి, శ్రీపర్వతం ప్రాంతాల్లో (నాగార్జునసాగర్ ప్రాంతం) బౌద్ధమతం మూడు దశల్లో పరిఢవిల్లింది.